
ANN తెలుగు
Follow: @ANNTELUGU
08-06-2026
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 159 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బ్రాహ్మణ పల్లి చెరువును చెరబట్టారు

ఏపీ ఆర్ ప్రవీణ్స్ అరాచకం
మూడు ఎకరాల చెరువు దురాక్రమణ
చెరువులో విలాసవంతమైన విల్లా నిర్మాణాలు
తుర్కయంజాల్ లో సాగుతున్న అక్రమ దందా
బ్రాహ్మణపల్లి చెరువు కబ్జా పై మహా పత్రిక అందిస్తున్న
సంచలనాత్మక కథనాలతో రేపటినుంచి మీ ముందుకు

02

**టాప్ న్యూస్**



### బిగ్ బాస్ 'దశావతారం' 10వ సీజన్ కు రెడీ
ప్రోమోతో హైప్..
కంటెస్టెంట్ల వేట షురూ

02



### లారెన్స్ పొలిటికల్ ఎంట్రీ
11న కీలక ప్రకటన

02



### జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ దే గెలుపు
టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

02

# రేవంత్.. సంచలనం

## సీఎం కామెంట్స్ పై దేశవ్యాప్త చర్చ

### భగ్గుమన్న కేంద్రమంత్రులు

దేశాన్ని విభజించొద్దు అంటూ కేంద్రమంత్రి రిజిజు ఫైర్
కర్నాటకలో.. వైరల్ గా మారిన రేవంత్ వ్యాఖ్యలు
మా కర్నాటక నేతలు కూడా..
రేవంత్ లా సౌత్ గళం వినిపించాలంటూ కామెంట్స్
పన్నులు కట్టి.. ఢిల్లీకి సెల్యూట్ కొట్టాలా?
అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలు సెన్సేషన్
నిన్న కేరళ... నేడు కర్నాటకలో
ప్రజలను ఆకర్షించిన రేవంత్



(హైదరాబాద్ మహా)

రేవంత్ రెడ్డి.. ధనాధన్. ఫటాఫట్. ఇపుడు సౌత్ రాజకీయాల్లో ధనాధన్ దూసుకెళ్తున్నారు. కేరళలో నిపోమాను విజయన్ అంటూ ఎన్నికల ప్రచారగతినే మలుపుతిప్పిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇపుడు కర్నాటకలో హిందూ పత్రిక నిర్వహించిన సదస్సుకు వెళ్ళి సౌత్ వర్సెస్ నార్త్ విభజన, అన్యాయాన్ని స్పష్టంగా చెప్పారు. పన్నులు కట్టి.. ఢిల్లీకి సలాం కొట్టాలా? మేం ద్వితీయశ్రేణి పౌరులుగా ఉండాలా? అంటూ రేవంత్ విసిరిన సవాల్, చేసిన కామెంట్స్ దేశ వ్యాప్తంగా వైరల్ అయ్యాయి. కర్నాటకతో పాటు ఉత్తరాదిలోనూ రేవంత్ క్లిప్స్ ఎన్డీఏ ప్రత్యామ్నాపార్టీలు, యువత వైరల్ చేస్తున్నారు. మా నేతలు కూడా ఢిల్లీకి వ్యతిరేకంగా ఇలా.. దక్షిణాది గళం విప్పాలి కర్నాటక యువత రేవంత్ వీడియోను. కామెంట్స్ ను

మిగతా 2వ పేజీలో



### జూన్ 15న బడుల పునఃప్రారంభం
- సెలవులు పొడిగించిన తెలంగాణ సర్కారు!
- రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నింటికీ వర్తింపు

02




### ఎంపీ ఈటలపై ఫ్లెక్సీల కలకలం
- ఎస్వోటీ వలలో నలుగురు నిందితులు.
- తెరవెనుక అసలు సూత్రధారులను తేల్చాలని బీజేపీ శ్రేణుల డిమాండ్.

03



### ఇండియా జన్ బంధన్' పేరిట నేడు విపక్షాల సమావేశం
- హాజరుకానున్న 23పార్టీలు
- ఆప్, డీఎంకే దూరం

02



### భారత్ లో జననాల రేటు క్షీణత
- ఉత్తరప్రదేశ్, బీహార్ దే భవిష్యత్ దేశం
- సౌత్ లో దారుణంగా పడిపోయిన సంతానోత్పత్తి.
- 'ఎక్స్' వేదికగా ఎలన్ మస్క్ ఆందోళన

02

## కిషన్ రెడ్డి బరాబర్ నీ సంగతేంటో తేలుస్తాం

ఉప్పల్ లో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు

- తెలంగాణ ప్రజలతో గోక్కుంటే బతికి బట్టకట్టలేరు
- ఈనెల 15 తర్వాత కార్యాచరణ ప్రకటిస్తా
- పరిపాలనా సౌలభ్యం కోసమే మూడు కార్పొరేషన్లు
- మూసీ మురికి వల్లే ఉప్పల్ విలువ తగ్గింది

02





## భయపడ్డానికి నేను కేసీఆర్‌ను కాదు
- నన్ను ఆపేవారు ఈ గడ్డమీద పుట్టలేదు
- సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్

02

## 'కింగ్స్ అండ్ క్వీన్స్' పబ్ గలీజ్ దందా
- యువతను నిలువునా దోచేస్తున్న చీకటి భాగోతం
- ఒంటరిగా పబ్‌లోకి ప్రవేశించి గుట్టు రట్టు చేసిన డీసీపీ రితిరాజ్
- సైబరాబాద్ నైట్ లైఫ్ ముసుగులో సాగుతున్న వ్యభిచార, అశ్లీల మాఫియాపై ఉక్కుపాదం
- స్థానిక పోలీసుల నిర్లక్ష్యంపై డీసీపీ తీవ్ర ఆగ్రహం.

02






## మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు 7 రోజుల డెడ్‌లైన్
- తప్పుకోకపోతే ఉద్యమమే!
- జంతర్ మంతర్ నిరసన కేవలం ట్రైలర్ మాత్రమే.
- తేల్చిచెప్పిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే.

03



# రేవంత్.. సంచలనం

**మొదటి పేజీ తరువాయి**



షేర్ చేస్తున్నారు. మరోవైపు రేవంత్ వ్యాఖ్యలు జాతీయస్థాయిలో చర్చగా మారడంతో కేంద్ర సర్కార్ ఖంగుతింది. పునర్విభజన బిల్లును గట్టెక్కించాలని ఆపసోపాలు పడుతున్న బిజెపికి మళ్ళీ రేవంత్ రెడ్డి ఇందులో జరిగే అన్యాయాన్ని బలంగా చెప్పడంతో కేంద్రమంత్రులు స్పందించారు. సీఎం రేవంత్ పై ఎటాక్ మొదలుపెట్టారు. ప్రధానమంత్రి నార్త్, రాష్ట్రపతి నార్త్, కేంద్రహోంమంత్రి, రక్షణమంత్రి అందరూ నార్తే.. మా సౌత్ ఈ దేశానికి ఇచ్చే కంట్రిబ్యూషన్ ఎంత? మా రాజకీయ వాటా ఎంత? సీఎం రేవంత్ చేసిప వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. సౌత్ లో కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా ఉండగా, ఒక్క ఏపీ మినహా సౌత్ అంతా కాంగ్రెస్ ప్రభుత్వాలే కొలువు దీరి ఉన్నాయి. దీంతో ఇక్కడ ప్రజలను మెప్పించడం బీజేపీకి కత్తిమీద సామే.

దేశాన్ని విభజించొదంటూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఫైర్

రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాది, దక్షిణాది అంటూ దేశాన్ని విభజించే ప్రయత్నాలు మానుకోవాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ప్రాంతీయ భేదాలతో ప్రజల మధ్య అగాధాన్ని సృష్టించడం దేశ సమగ్రతకు ఏమాత్రం శ్రేయస్కరం కాదని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో అన్ని ప్రాంతాలకు, అన్ని వర్గాలకు అత్యంత సముచిత స్థానం దక్కిందని, ఎక్కడా ఎలాంటి వివక్షకు తావులేదని ఆయన ఉద్ఘాటించారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తులు ఇలాంటి సంకుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వీటిపై సుదీర్ఘవివరణ ఇచ్చారు. మరోవైపు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా సీఎం రేవంత్ రెడ్డిపై ఎన్నడూలేని స్థాయిలో ఫైర్ అయ్యారు. జాతీయస్థాయిలో రేవంత్ వ్యాఖ్యలు బలంగా వెళ్తుండడంతో బిజెపి అలర్ట్ అయింది.




# బిగ్ బాస్ 'దశావతారం' 10వ సీజన్ కు రెడీ

**ప్రోమోతో హైప్.. కంటెస్టెంట్ల వేట షురూ**

హైదరాబాద్, మహా 'బిగ్ బాస్ తెలుగు' పదో సీజన్ కు రెడీ అయింది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు పదో సీజన్‌లోకి అడుగుపెడుతోంది. కింగ్ నాగార్జున మరోసారి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ ల్యాండ్‌మార్క్ సీజన్‌కు 'దశావతారం' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ స్టార్ మా, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ అధికారిక ప్రోమోను విడుదల చేశాయి. గత సీజన్‌లో 'ఉల్టాపుల్టా' అంటూ భారీ హైప్ ఇచ్చినా, చివరికి షో రొటీన్ టాస్కులు, గ్రూపిజం, అవే గొడవలతోనే సాగిందనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కూడా 'దశావతారం' అంటూ క్లాస్ ప్రోమో వదిలారు కానీ, షో ప్రారంభమయ్యాక కంటెంట్ నిజంగా కొత్తగా ఉంటుందా లేక ఎప్పటిలాగే నీరసంగా సాగుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం బిగ్ బాస్ నిర్వాహకులు పదో సీజన్ కోసం కంటెస్టెంట్ల వేటలో నిమగ్నమయ్యారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, బుల్లితెర నటీనటులు, కొంతమంది వివాదాస్పద సెలబ్రిటీలను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

# భారత్ లో జననాల రేటు క్షీణత

**ఢిల్లీ, మహా :** భారతదేశంలో జననాల రేటు గణనీయంగా తగ్గుముఖం పడుతోందన్న అంశం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. ప్రపంచ కుబేరుడు, ప్రముఖ అంతరిక్ష పరిశోధనా సంస్థ స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ దేశంలోని జనాభా గమనాలపై చేసిన తాజా సామాజిక మాధ్యమ పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. దేశంలో జనాభా స్థిరత్వానికి అత్యంత అవసరమైన ప్రతిస్థాపన స్థాయి (రీప్లేస్‌మెంట్ లెవెల్) కంటే జననాల రేటు దిగువకు పడిపోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ 'ఏఎఫ్ పోస్ట్' షేర్ చేసిన దేశ భౌగోళిక, జనాభా గణాంకాల డేటాను ప్రస్తావిస్తూ మస్క్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. భారతదేశంలో జననాల రేటు ప్రతిస్థాపన స్థాయి కంటే వేగంగా తగ్గిపోతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, దేశంలో బాగా చదువుకున్న విద్యావంతులైన వారిలో ఈ రేటు చాలా ఏళ్ల క్రితమే పడిపోయిందని ఆయన తన పోస్టులో విశ్లేషించడం గమనార్హం. చరిత్రలో తొలిసారిగా ప్రతిస్థాపన స్థాయి కంటే దిగువకు.

భారతదేశ చరిత్రలో తొలిసారిగా మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) ప్రతి మహిళకు 2.1 పిల్లలు అనే కనీస ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని 'ఏఎఫ్ పోస్ట్' నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలోనే దేశీయ సంతానోత్పత్తి రేటు 2.3 నుంచి 1.9కి క్షీణించిందని తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీలో అయితే ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఢిల్లీలో సంతానోత్పత్తి రేటు ఏకంగా 1.2కి పడిపోయిందని, ఇది యూరప్ దేశమైన ఫిన్‌లాండ్ కంటే కూడా తక్కువని నివేదిక స్పష్టం చేసింది. దేశంలోని దక్షిణాది, తూర్పు రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు భారీగా తగ్గుతోంది. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో ఈ రేటు 1.3గా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 1.4గా, తెలంగాణలో 1.5గా ఉంది. వీటన్నింటికీ భిన్నంగా ఉత్తరాది రాష్ట్రాలైన రాజస్థాన్ (2.1), ఉత్తరప్రదేశ్ (2.4), బీహార్ (3.0) లలో మాత్రం ఈ రేటు ఇప్పటికీ ఎక్కువగా ఉండటం గమనార్హం. దీని ప్రకారం ప్రకారం చూస్తే మరో 15, 20 ఏళ్ళ తర్వాత ఉత్తర ప్రదేశ్, బీహార్ ల జనాభాకు.. సౌత్ పాపులేషన్ భారీ తేడా రానుంది.

**ఐక్యరాజ్యసమితి నివేదిక హెచ్చరిక**

ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్ 2025' సైతం ఇదే ఆందోళనకర పరిణామాలను ధ్రువీకరించింది. భారతదేశంలో సగటు సంతానోత్పత్తి రేటు 1.9గా నమోదైందని, ఇది జనాభా స్థిరత్వానికి కావలసిన 2.1 శాతం కంటే తక్కువ అని స్పష్టం చేసింది. దేశంలో సంతానోత్పత్తి రేటు గనుక ఇదే రీతిన కొనసాగితే, భవిష్యత్తులో రాబోయే ప్రతి తరం మునుపటి తరం కంటే చిన్నదిగా మారిపోతుందని, ఫలితంగా దేశ జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టే ప్రమాదం ఉందని నివేదిక విశ్లేషించింది. జననాల రేటు క్రమంగా తగ్గుతున్నప్పటికీ, ప్రస్తుతం 146 కోట్లకు పైగా ఉన్న భారీ జనాభాతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా అగ్రస్థానంలో కొనసాగుతోంది. గత 2023లోనే చైనాను అధిగమించి భారత్ ఈ స్థానాన్ని దక్కించుకుంది. సమాజంలో విద్య, పట్టణీకరణ విపరీతంగా పెరగడం, మహిళలు పెద్ద సంఖ్యలో ఉద్యోగాల్లో స్థిరపడటం, మారుతున్న ఆధునిక కుటుంబ ప్రాధాన్యతలు, ఆర్థిక స్థితిగతులు వంటి అంశాలే ఈ జననాల రేటు తగ్గుదలకు ప్రధాన కారణాలని సామాజిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రసూతి మరణాలు, లింగ వివక్ష వంటి సవాళ్లు ఇంకా వేధిస్తూనే ఉన్నాయని యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక ఎత్తిచూపింది.

# ఇండియా జన్ బంధన్' పేరిట నేడు విపక్షాల సమావేశం

**ఢిల్లీ, మహా :** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ప్రతిపక్ష 'ఇండి' కూటమి తొలిసారిగా అత్యంత కీలక సమావేశానికి సిద్ధమైంది. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సోమవారం నాడు జరగబోయే ఈ ప్రత్యేక భేటీకి ఇండియా జన్ బంధన్ అని నామకరణం చేశారు. దేశంలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భవిష్యత్తు పోరాట కార్యాచరణను ఖరారు చేసేందుకు ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ మహాసభకు దేశవ్యాప్తంగా ఉన్న 23 రాజకీయ పార్టీలకు చెందిన అగ్రనేతలు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ పోస్టును పంచుకున్నారు. మమత ఈ సమావేశానికి హాజరయ్యేందుకు ఢిల్లీ ఆదివారమే చేరుకోగా, డీఎంకే, ఆప్ భేటీకి దూరంగా ఉన్నాయి.

# కిషన్ రెడ్డి బరాబర్ నీ సంగతేంటో తెలుస్తాం

acc**హైదరాబాద్, మహా :** కిషన్ రెడ్డి.. నన్ను ఎవరు అడ్డుకోలేరని చెప్తున్నవు.. ఈనెల 15 తర్వాత బరాబర్ నీ సంగతి తేలుస్తాం. మా ట్రిపుల్ ఆర్ కు ఎందుకు అనుమతులు రావో.. మా రైతుల వడ్లు ఎందుకు కొనవో. మా మెట్రోకు ఎందుకు అనుమతులు రావో.. అన్నీ తేలుస్తాం. కార్యాచరణ ప్రకటిస్తా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మరోసారి ఫైరయ్యారు. జీహెచ్ఎంసీని పరిపాలనా సౌలభ్యం కోసమే మూడు కార్పొరేషన్లుగా విభజించామని, ఎన్నికల్లో లబ్ధికోసమే విభజించినట్లు వస్తోన్న ఆరోపణల్లో నిజం లేదని సీఎం పేర్కొన్నారు. ఉప్పల్ భగాయత్ లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం సీఎం ప్రసంగించారు. నగరంలో ప్రజలు ఏ పని కావాలన్నా ట్యాంక్ బండ్ వద్దకే వెళ్లాల్సి వస్తోందని, అంతదూరం వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే కార్పొరేషన్లను విభజించామన్నారు. మల్కాజిగిరి అభివృద్ధి కోసం ఎన్ని నిధులు కావాలన్నా ప్రభుత్వం నుంచి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఎంపీగా చేయలేని పనులన్నీ ఇప్పుడు సీఎంగా ఉండి చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. తాను ఎన్నికలున్నపుడు మాత్రమే రాజకీయాలు చేస్తానని.. ఆ తర్వాత అభివృద్దే అజెండాగా ముందుకు వెళ్తామన్నారు. జూన్ 15వ తేదీ తర్వాత.. మెట్రో విస్తరణకి అనుమతులు, ఆర్ఆర్ఆర్ కు పర్మిషన్, రాష్ట్రంలో వడ్లు కొనడం, మూసీ ప్రక్షాళనకు అనుమతులు రాకుంటే.. బరాబర్



కిషన్ రెడ్డి సంగతేంటో చూస్తామని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి హెచ్చరించారు. ఆ పార్టీలోనే ఉండి.. పక్క పార్టీవాళ్లకి సపోర్ట్ చేస్తారని సొంతపార్టీ వాళ్లే కిషన్ రెడ్డి గురించి చెప్తున్నారని సీఎం విమర్శించారు. బీజేపీలో ఉంటూ.. కేటీఆర్ తో మాట్లాడుతారని చెప్తున్నారన్నారు. ఎన్నికలున్నప్పుడు రాజకీయాలు చేద్దామని, మిగతా సమయంలో ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించి, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని కోరారు.

**మూసీ మురికి వల్లే..**

మూసీ మురికి వల్లే ఉప్పల్ విలువ తగ్గిపోయిందని, దానివల్లే నల్గొండ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీఎం అన్నారు. అలాంటి మూసీని ప్రక్షాళన చేస్తామంటే.. అనేకమంది అడ్డుపడుతున్నారని దుయ్యబట్టారు. గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేశారని, యూపీలో గంగానదిని ప్రక్షాళన చేసినట్లు యోగి చెప్పుకున్నారని గుర్తు చేసిన సీఎం.. మూసీ ప్రక్షాళనకు మాత్రం అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫైరయ్యారు. మా మోదీ నదులను ప్రక్షాళన చేశారని గొప్పగా చెప్పుకుంటున్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళనపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారన్నారు.



# లారెన్స్ పొలిటికల్ ఎంట్రీ

**చెన్నై, మహా :** రాఘవ లారెన్స్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారన్న టాక్ జోరుగా వినిపిస్తోంది. విజయ్ ఖాళీచేసిన తిరుచ్చి నుండి లారెన్స్ ను బరిలోకి దింపాలని విజయ్ డిసైడ్ అయినట్లు మహాపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. తమిళ మీడియాలోనూ దీనిపై కథనాలు రాగా, ఈనెల 11న కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు రాఘవ లారెన్స్ స్వయంగా ప్రకటించారు. తమిళ స్టార్ హీరో, తమిళగ వెట్రి కజగంపార్టీ అధినేత, సీఎం విజయ్ గతంలో తాను గెలిచిన తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్న నేపథ్యంలో.. ఆ సీటు నుంచి లారెన్స్ పోటీ చేయడం ఖాయమనే ప్రచారం జోరందుకుంది. లారెన్స్‌కు విజయ్‌తో ఉన్న ఆత్మీయ సంబంధాల నేపథ్యంలో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. 'నా రాజకీయ ప్రయాణం, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం గురించి సోషల్ మీడియాలో, పొలిటికల్ సర్కిల్స్‌లో రకరకాల వార్తలు వస్తున్నాయి. వీటన్నింటికీ సంబంధించి, నా భవిష్యత్తు కార్యాచరణపై ఈనెల 11న ఓ కీలక ప్రకటన చేయబోతున్నాను. నా అభిమానులు, ప్రజలు అప్పటివరకు వేచి చూడాలని కోరుతున్నాను' అని లారెన్స్ పేర్కొన్నారు.

# నన్ను ఆపేవారు ఈ గడ్డమీద పుట్టలేదు

**సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్**

హైదరాబాద్, మహా : "నన్ను పొలిమేర దాటనివ్వను అంటున్నారు.. నన్ను ఆపేవారు ఇంకా ఈ గడ్డపై పుట్టలేదు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడటానికి నేను కేసీఆర్ ను కాను అంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డిలో రాజకీయ నిరాశ, నిస్పృహలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. సీఎం మాటలు కోటలు దాటుతున్నాయి కానీ.. చేతలు మాత్రం సెక్రటేరియట్ కూడా దాటడం లేదన్నారు. త్వరలోనే కాంగ్రెస్ ను ప్రజలు అడ్రస్ లేకుండా చేస్తారని, రాహుల్ గాంధీ ఈ జన్మలో, కలలో కూడా ప్రధాని కాలేరని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులకు, తాటాకు చప్పుళ్ళకు భయపడడానికి తాను కేసీఆర్‌ను కాదని, బీజేపీ కార్యకర్తను అని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "నన్ను కూడా కేసీఆర్ అని మీరు అనుకుంటున్నారేమో.. కానీ కాదు.. నేను బీజేపీ కార్యకర్తను.." అని కామెంట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులను దారుణంగా మోసం చేశారని కిషన్ రెడ్డి ఆరోపించారు. రైతులకు, వడ్లకు ఇస్తానన్న బోనస్ డబ్బులు ఇంకా ఇవ్వలేదన్నారు. అలాగే రైతు కూలీలకు, కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఊసే లేదని, రైతు రుణమాఫీ కూడా అరకొరగానే చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. కేంద్రం, ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే రుణాలతో రేవంత్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని విమర్శించారు. తానేంటో తెలంగాణ ప్రజలకు స్పష్టంగా తెలుసని, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు మాటల పార్టీలే తప్ప.. చేతల పార్టీలు కావన్నారు. తెలంగాణకు తానేం చేశానో రేవంత్ రెడ్డి సర్టిఫికేట్ ఇవ్వాల్సిన అవసరం లేదని ఫైరయ్యారు. రేవంత్ సర్కారుకు అసలు ముసళ్ల పండుగ ముందు ఉందని, ముందుంది ముసళ్ల పండుగ.. రేవంత్ రెడ్డి తొందరపడొద్దు.. ఎవరెంత రెచ్చగొట్టినా నేను రెచ్చిపోయే వ్యక్తిని కానని స్పష్టం చేశారు. తాము ఏం చేసినా సంయమనంతో చేస్తాం.. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి కావాలన్నదే మా ఆశయమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. నేను పుట్టింది బీజేపీలోనే.. చచ్చేది బీజేపీలోనే అని.. 10 పార్టీలు మారలేదని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ దే గెలుపు

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, మహా :** రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జలమండలి యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ జెండా ఎగరడంపై మహేశ్ కుమార్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు. 800 ఓట్ల భారీ మెజారిటీతో అధ్యక్షుడిగా గెలిచిన రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కార్మికులకు ఉన్న నమ్మకానికి నిదర్శనం అని వ్యాఖ్యానించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీదే గెలుపు అని ధీమా వ్యక్తం చేశారు. ఈ రెండున్నర సంవత్సరాలలో ఎన్నో సమస్యలు పరిష్కరించామని చెప్పారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు రోజుల తరబడి సమ్మె చేసినా పట్టించుకోలేదని అన్నారు. కానీ మొన్న ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే మూడు రోజుల్లో పిలిచి సమస్యను పరిష్కరించామని చెప్పారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం నుండి సింగరేణిని ఒకరు, జలమండలిని ఒకరు తమ గుప్పిట్లో పెట్టుకున్నారని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి ప్రజాస్వామ్యాన్ని ఇచ్చిందని చెప్పారు.

# జూన్ 15న బడుల పునఃప్రారంభం

**హైదరాబాద్, మహా :** వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చే కీలక అప్‌డేట్ అందించింది. ముందుగా ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ 12న బడులు తెరుచుకోవాల్సి ఉండగా.. ఆ తేదీని మారుస్తూ రాష్ట్ర విద్యాశాఖ తాజాగా నిర్ణయం తీసుకుంది. వేసవి సెలవులను మరో మూడు రోజుల పాటు పొడిగిస్తూ, జూన్ 15వ తేదీన (సోమవారం) పాఠశాలలను పునఃప్రారంభించనున్నట్లు స్పష్టం చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల పునఃప్రారంభ తేదీ మార్పు వెనుక ప్రధాన కారణం వారాంతపు సెలవులే. పాత షెడ్యూల్ ప్రకారం జూన్ 12వ తేదీ (శుక్రవారం) పాఠశాలలు తెరిచినా.. వెంటనే జూన్



13న రెండో శనివారం, జూన్ 14న ఆదివారం వరుసగా రానున్నాయి. కేవలం ఒక్క రోజు (శుక్రవారం) కోసం బడులు తెరిచి, మళ్లీ వెంటనే రెండు రోజులు వారాంతపు సెలవులు ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో, అటు పాఠశాల యాజమాన్యాల్లో తీవ్ర గందరగోళం తలెత్తే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పునఃప్రారంభ తేదీని పునఃపరిశీలించాలంటూ పలు వర్గాల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. ఈ అభ్యర్థనలను సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ఒక్క రోజు కోసం బడులు తెరవడం కంటే, ఆ వారాంతపు సెలవుల తర్వాతే ప్రారంభించడం అత్యుత్తమమని భావించింది. తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలకు ఈ సెలవుల పొడిగింపు వర్తించనుంది. విద్యార్థులంతా జూన్ 15వ తేదీ సోమవారం నాడు ఉత్సాహంగా బడిబాట పట్టనున్నారు.

# 'కింగ్స్ అండ్ క్వీన్స్' పబ్ గలీజ్ దందా

**హైదరాబాద్, మహా :** వీకెండ్ లో యువత ఆశ్రయిస్తున్న పబ్‌లు.. కొందరు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపించే అసాంఘిక అడ్డాలుగా మారిపోతున్నాయి. ఇలాంటి చీకటి భాగోతాన్ని సైబరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లిలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) రితిరాజ్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పబ్ లలో సాగుతున్న గలీజ్ దందాను బట్టబయలు చేశారు. గ్లామర్, మ్యూజిక్, మత్తు ముసుగులో అమాయక యువకులను ఆకర్షించి నిలువునా దోచుకుంటున్న 'కింగ్స్ అండ్ క్వీన్స్' పబ్ వ్యవహారాన్ని ఆమె స్వయంగా రంగంలోకి దిగి బట్టబయలు చేశారు. పోలీసు ఉన్నతాధికారిణిగా తనకున్న బందోబస్తును, భద్రతను పక్కనపెట్టి, అర్ధరాత్రి వేళ ఒంటరి మహిళగా పబ్‌లోకి ప్రవేశించి ఆమె చేసిన ఈ 'స్పై ఆపరేషన్' ఇప్పుడు పోలీసు శాఖలో, నగర పౌరుల్లో సంచలనంగా మారింది.

యువకులే లక్ష్యంగా అమ్మాయిలతో వల

కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్ యాజమాన్యం కేవలం మద్యం, ఆహారం విక్రయించి లాభాలు గడించాలనే వ్యాపార సూత్రాన్ని ఎప్పుడో పక్కనపెట్టేసింది. కస్టమర్లను, ముఖ్యంగా జేబులు నిండా డబ్బులతో ఉండే ఐటీ యువకులు, విద్యార్థులను ఆకర్షించడానికి అత్యంత అసహ్యకరమైన 'గలీజ్ దందా'కు తెరలేపింది. దర్యాప్తులో వెలుగుచూసిన ఆశ్చర్యకరమైన వాస్తవాల ప్రకారం.. పబ్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా కొంతమంది యువతులను నియమించుకుంది. ఈ యువతుల ద్వారా సోషల్ మీడియా యాప్స్, డేటింగ్ యాప్స్, ఇతర చాటింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి యువకులతో పరిచయాలు పెంచుకుంటారు. మాటల గారడీతో వారిని బుట్టలో వేసుకుని, "మనం ఈ రాత్రి కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్‌లో కలుద్దాం" అంటూ వలపు వల విసురుతారు. అమ్మాయిలే స్వయంగా పిలవడంతో ఎగిరిగంతేసుకుంటూ పబ్‌కు వచ్చే యువకులకు అక్కడ మత్తు, అర్ధనగ్న నృత్యాలతో మాయ చేస్తారు. వారి ద్వారా వేలకు వేలు బిల్లులు చేయించి జేబులు గుల్ల చేయడమే ఈ గ్యాంగ్ ప్రధాన ఉద్దేశం. ఈ ఫిర్యాదులు పెద్ద ఎత్తున రావడంతోనే డీసీపీ స్వయంగా ఆపరేషన్ కు శ్రీకారం చుట్టారు.



**సామాన్యురాలిగా ఎంట్రీ**

అధికారిక లాంఛనాలతో, పోలీసు వాహనాలతో సైరన్ వేసుకుంటూ వెళితే పబ్ నిర్వాహకులు అప్రమత్తమై ఆధారాలు మాయం చేస్తారని డీసీపీ రితిరాజ్ భావించారు. అందుకే ఆదివారం తెల్లవారుజామున ఒక సినిమాలోని సీన్‌ను తలపించేలా తన వ్యూహాన్ని అమలు చేశారు. తన గన్‌మెన్లను, సెక్యూరిటీని, ఎస్కార్ట్ వాహనాలను పబ్‌కు చాలా దూరంలోనే నిలిపివేశారు. ముఖానికి మాస్క్ ధరించి, ఒక సాధారణ మహిళగా టికెట్ తీసుకుని నేరుగా పబ్‌లోకి అడుగు పెట్టారు. బయటకు ప్రశాంతంగా, ఎలాంటి చప్పుడు లేకుండా కనిపిస్తున్న పబ్ లోపల మాత్రం పరిస్థితి భయానకంగా ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్ధరాత్రి 12 గంటలకే మూసివేయాల్సిన పబ్‌లో.. తెల్లవారుజామున కూడా చెవులు పగిలేంత హై వాల్యూమ్ మ్యూజిక్ హోరెత్తుతోంది. డ్యాన్స్ ఫ్లోర్‌పై యువతులు, యువకులతో అభ్యంతరకర రీతిలో నృత్యాలు చేయిస్తూ, అసభ్యకరమైన వాతావరణాన్ని సృష్టించారు. డీసీపీ రితిరాజ్ ఒక మూల నిలబడి, తన మొబైల్ ఫోన్‌లో ఈ అసాంఘిక కార్యకలాపాలన్నింటినీ అత్యంత చాకచక్యంగా వీడియో రికార్డ్ చేశారు.

**ఒక్కసారిగా ఆగిపోయిన మ్యూజిక్**

పబ్‌లో జరుగుతున్న వ్యవహారంపై పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరం, డీసీపీ రితిరాజ్ తన బృందానికి, కూకట్‌పల్లి స్థానిక పోలీసులకు కోడ్ భాషలో సంకేతాలు పంపారు. క్షణాల వ్యవధిలో భారీ పోలీసు బలగాలు పబ్‌ను చుట్టుముట్టాయి. అప్పటివరకు డ్యాన్స్ ఫ్లోర్‌లో మత్తులో ఊగుతున్న యువత.. ఒక్కసారిగా పోలీసులు, లాఠీలతో ఎంట్రీ ఇవ్వడంతో షాక్‌కు గురయ్యారు. పెద్ద పెట్టున మోగుతున్న మ్యూజిక్ ఒక్కసారిగా ఆగిపోయింది. ఎవరూ బయటకు వెళ్లకుండా పోలీసులు ప్రధాన ద్వారాలను మూసివేశారు. ఏం జరుగుతుందో అర్థంకాక పబ్ మేనేజ్‌మెంట్ నిశ్చేష్టులైంది. అప్పటివరకు ఒక సాధారణ కస్టమర్‌గా ఉన్న మహిళ.. డీసీపీ రితిరాజ్ అని తెలుసుకున్న పబ్ యజమానులు, సిబ్బంది భయంతో వణికిపోయారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, కస్టమర్లను ఆకర్షించేందుకు నియమించిన యువతులతో పాటు పబ్‌లో ఉన్న విటులను అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్ మేనేజర్‌ను అక్కడికక్కడే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**స్థానిక పోలీసులపై డీసీపీ ఫైర్**

ఈ మొత్తం వ్యవహారంలో కూకట్‌పల్లి స్థానిక పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. తమ పరిధిలో ప్రతిరోజూ ఇంత పెద్ద ఎత్తున చట్టవిరుద్ధ కార్యక్రమాలు, గలీజ్ దందా నడుస్తున్నప్పటికీ స్థానిక ఇన్‌స్పెక్టర్, పెట్రోలింగ్ సిబ్బంది కళ్లు మూసుకోవడంపై డీసీపీ రితిరాజ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పబ్ యాజమాన్యంతో కుమ్మక్కై మామూళ్లకు కక్కుర్తి పడ్డారా? లేక విధుల్లో నిర్లక్ష్యమా? అంటూ అక్కడే ఉన్న అధికారుల క్లాస్ తీసుకున్నారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిపై కూడా అంతర్గత విచారణ జరిపి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఆపరేషన్ నగరంలోని ఇతర పబ్ నిర్వాహకులకు ఒక స్పష్టమైన, కఠినమైన హెచ్చరికను జారీ చేసింది. వ్యాపారం ముసుగులో వ్యభిచారం, డ్రగ్స్, హనీట్రాప్ లాంటి చర్యలకు పాల్పడితే.. ఇకపై ఉపేక్షించేది లేదని సైబరాబాద్ కమీషనరేట్ వర్గాలు స్పష్టం చేశాయి. కస్టమర్ల వివరాలు సేకరించడం, సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకోవడం ద్వారా ఈ చీకటి దందా వెనుక ఇంకెవరి హస్తం ఉందన్న కోణంలో లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

# ఎంపీ ఈటలపై ఫ్లెక్సీల కలకలం

- **ఎస్వోటీ వలలో నలుగురు నిందితులు.**
- **తెరవెనుక అసలు సూత్రధారులను తేల్చాలని బీజేపీ శ్రేణుల డిమాండ్**




**హైదరాబాద్, మహా:** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా వివాదాస్పద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసుకు సంబంధించి మాదాపూర్ ఎస్వోటీ (స్పెషల్ ఆపరేషన్స్ టీమ్) పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలి కాలంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను తీవ్రంగా విమర్శిస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి, సుచిత్ర, కేపీహెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపడమే కాకుండా, రాజకీయంగానూ దుమారానికి దారితీసింది.తమ నేతను కించపరిచేలా ఉద్దేశపూర్వకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన భారతీయ జనతా పార్టీ నాయకులు.. వెంటనే సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో ఫ్లెక్సీలు కట్టినవారిని గుర్తించిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు పక్కా వ్యూహంతో నలుగురిని అరెస్టు చేశారు. అనంతరం తదుపరి లోతైన విచారణ నిమిత్తం ఆ నలుగురు నిందితులను కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు.మరోవైపు, నిందితుల అరెస్టు విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు వెంటనే కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు పోలీసుల దర్యాప్తుపై స్పందిస్తూ కీలక డిమాండ్లు ముందుంచారు. కేవలం ఫ్లెక్సీలు కట్టిన వారిని మాత్రమే పట్టుకుంటే సరిపోదని, అసలు ఏ ఉద్దేశంతో ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారో నిగ్గు తేల్చాలని పట్టుబట్టారు. పార్లమెంటు సభ్యుడిపై ఇంతటి దుష్ప్రచారానికి ఒడిగట్టిన వారి వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరన్నది విచారణలో బయటపెట్టి, వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశాయి.

# మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు 7 రోజుల డెడ్‌లైన్

- **తప్పుకోకపోతే ఉద్యమమే!**
- **జంతర్ మంతర్ నిరసన కేవలం ట్రైలర్ మాత్రమే.**
- **తేల్చిచెప్పిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే.**



**ఢిల్లీ, మహా :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. కేవలం ఏడు రోజుల్లోగా మంత్రి తన పదవికి రాజీనామా చేసి తప్పుకోవాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన స్పష్టమైన అల్టిమేటం ఇచ్చారు. విద్యా వ్యవస్థలోని లోపాలు, విద్యార్థుల పట్ల మంత్రి వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన ఈ సంచలన ప్రకటన విడుదల చేశారు.దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో తాము చేపట్టిన శాంతియుత మహా నిరసన ఒక చారిత్రక ఘట్టమని అభిజీత్ దీప్కే అభివర్ణించారు. 'బొద్దింకలు' (కాక్రోచ్‌లు) అన్నీ ఏకమైతే వ్యవస్థను ఎలా కదిలించగలవో ప్రభుత్వానికి రుచి చూపించిన చిన్న ట్రైలర్ మాత్రమే నిన్నటి ఆందోళన అని ఆయన కుండబద్దలు కొట్టారు. ఆ నిరసనలో పాల్గొన్న వారిలో అత్యధికులు మొదటిసారిగా రోడ్డెక్కిన వారేనని, విద్యా వ్యవస్థపై వారిలో గూడుకట్టుకున్న తీవ్రమైన కోపానికి, నిరాశకు ఈ ఆందోళన అద్దం పడుతోందని ఆయన విశ్లేషించారు. తమ భవిష్యత్తు కోసం గళమెత్తేందుకు వారంతా ఎంతో ధైర్యంగా ముందుకు రావడం వ్యవస్థలో మార్పునకు సంకేతమన్నారు.
మండే ఎండలను సైతం ఏమాత్రం లెక్కచేయకుండా ఉద్యమంలో భాగస్వాములైన యువత, విద్యార్థులు, ఇతర మద్దతుదారులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతియుత నిరసనే తమ అతిపెద్ద బలమని, ఐకమత్యంతో సాగే ఇలాంటి అహింసాత్మక ఉద్యమాన్ని ఏ ప్రభుత్వమూ ఏమీ చేయలేదని ఆయన తేల్చిచెప్పారు. న్యాయం కోసం పోరాడే క్రమంలో ఎవరికీ, ఎక్కడా భయపడాల్సిన అవసరమే లేదని ఉద్యమకారుల్లో ఆయన నూతనోత్సాహాన్ని నింపారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన చర్యలతో ఒక తరాన్ని తీవ్ర అన్యాయానికి గురిచేశారని అభిజీత్ ఆరోపించారు. ఈ వ్యవహారం కేవలం ఒక్క రోజు నిరసనతోనే సమసిపోదని, తమ డిమాండ్ నెరవేరే వరకు పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో చేపట్టబోయే ఉద్యమ స్వరూపం, తదుపరి కార్యాచరణ ప్రణాళికపై చర్చించేందుకు ఆయన నేడు ఇన్‌స్టాగ్రామ్ లైవ్ వేదికగా తన అనుచరులు, మద్దతుదారులతో ముఖాముఖి మాట్లాడనున్నట్లు వెల్లడించారు. ఈ పరిణామాలతో కేంద్ర మంత్రి రాజీనామా వ్యవహారంపై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# యువ కెరటానికి బీసీసీఐ బంపరాఫర్

**ఢిల్లీ, మహా :** ఆడుకునే వయసులో అద్భుతాలు సృష్టిస్తూ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన పదిహేనేళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అండగా నిలిచింది. ఐపీఎల్‌లో తన అసాధారణ ఆటతీరుతో ఏకంగా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న ఈ యువ బ్యాటర్‌కు అరుదైన అవకాశం కల్పించింది. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో విదేశీ వాతావరణంలో అతను ఇబ్బంది పడకుండా ఉండేందుకు అతని తల్లిదండ్రులను కూడా వెంట తీసుకెళ్లేందుకు బోర్డు అనుమతినిచ్చింది. అంతేకాకుండా, వారి ప్రయాణ ఖర్చులన్నింటినీ ఏ మాత్రం భారం పడకుండా తామే స్వయంగా భరిస్తామని ప్రకటించడం విశేషం.



# రైతుల భూములను లాక్కోవడం కాంగ్రెస్ మార్కు నిరంకుశత్వం

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శైలిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నిప్పులు.**

**హైదరాబాద్, మహా :** కోహెడలో నష్టపరిహారం చెల్లించకుండా రైతుల భూములను బలవంతంగా లాక్కోవడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోహెడలోని సర్వే నంబర్ 167/1 పరిధిలో ఉన్న 239 ఎకరాల భూమి రైతుల సొంతమని స్పష్టం చేశారు. బాధితులకు ఒక్క రూపాయి కూడా సరైన పరిహారం ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ ఫ్రూట్ మార్కెట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఫ్రూట్ మార్కెట్ అందుబాటులో ఉన్నప్పటికీ, పక్కనే ఉన్న రైతుల భూములను సేకరించి ఇతర ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూడటం దుర్మార్గమని మండిపడ్డారు. భూముల సేకరణను రైతులు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆక్షేపించారు.
ముఖ్యమంత్రి పర్యటనకు ముందే నిరసన తెలుపుతారనే భయంతో స్థానిక రైతులను, బీజేపీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, రోజంతా స్టేషన్లలో నిర్బంధించడాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. హక్కుల కోసం ప్రశ్నించే వారిని అణచివేయాలని చూడటం నిరంకుశ, రజాకార్ల పాలనను తలపిస్తోందని విమర్శించారు. మజ్లిస్ పార్టీతో సహవాసం చేయడం వల్లే కాంగ్రెస్‌కు నిజాం తరహా భాష, ధోరణి అలవాటయ్యాయని ఎద్దేవా చేశారు. రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించిన తర్వాతే అక్కడ పనులు చేపట్టాలని, అప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు సాగనిచ్చేది లేదని భారాస, కాంగ్రెస్ ఉమ్మడి వైఖరిపై పోరాడుతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం భూముల అమ్మకాలపైనే ఆధారపడుతూ, హైదరాబాద్ చుట్టుపక్కల రైతుల జీవనాధారాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



ఇటీవల మహబూబ్‌నగర్ సభలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన "పొలిమేర దాటనివ్వను" అనే వ్యాఖ్యలపై రాంచందర్ రావు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇలాంటి అహంకారపూరిత భాష ముఖ్యమంత్రి స్థాయికి తగదని హితవు పలికారు. తెలంగాణ సాధనలో, జేఏసీ ఉద్యమాల్లో బీజేపీ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. తమ పార్టీ శ్రేణులు తలుచుకుంటే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏమిచ్చిందని పదేపదే ప్రశ్నిస్తున్న ముఖ్యమంత్రికి ఆయన కౌంటర్ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం సుమారు రూ.13 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు.
రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాలను అనుసంధానిస్తూ రూ.8 వేల కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి, బీబీనగర్ ఎయిమ్స్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ టెక్స్‌టైల్ పార్క్, ములుగు గిరిజన విశ్వవిద్యాలయం వంటివన్నీ కేంద్రం ఇచ్చినవేనని స్పష్టం చేశారు. పేదలకు అందుతున్న ఐదు కిలోల ఉచిత బియ్యం కూడా కేంద్రానిదేనని స్పష్టం చేశారు. కేంద్ర నిధులపై తాము శ్వేతపత్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఏమిచ్చిందో చెప్పే ధైర్యం ఉంటే సచివాలయం గేటు వద్దైనా బహిరంగ చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అవినీతి, కమిషన్ల పాలనను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రస్తుత అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని రాంచందర్ రావు పేర్కొన్నారు.

# ధరల పెంపుతో... ప్రజా జీవితం సంక్షోభంలోకి

- **విద్యా వైద్యం రవాణా మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వాలు విఫలం**
- **ఈనెల 10న చలో మేడ్చల్ కలెక్టరేట్**
- **జవహర్ నగర్ మున్సిపల్ ఆఫీసు ముందు గోడ పత్రిక ఆవిష్కరణ**
- **సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటపల్లి శంకర్**




**కుషాయిగూడ, మహా:** నిత్యావసర ధరల పెంపుతో ప్రజా జీవితం తీవ్ర సంక్షోభంలోకి వెళుతోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని తప్పితే ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటపల్లి శంకర్ దుయ్యబట్టారు. నిత్యావసర ధరల పెంపును నిరసిస్తూ ఈనెల 10వ తేదీన మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలుపుతూ సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో జవహర్ నగర్లో గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ దేశంలో నిత్యవసర వస్తువుల ధరలు వంట గ్యాస్ పెట్రోల్ డీజిల్ విద్యుత్ చార్జీలు విద్యా వైద్యం ఖర్చులు రోజురోజుకు పెరుగుతూ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయని ఈ విధానాలను నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 10వ తేదీన మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బాధలను పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నిరుద్యోగం పెరుగుతోందని మరోవైపు ధరలు ఆకాశాన్ని అంటుతూ ఉన్నాయన్నారు. సాధారణ కుటుంబం నెల వారి ఖర్చులు భరించలేని పరిస్థితికి చేరు కొన్నాయన్నారు. బియ్యం పప్పులు కూరగాయలు వంటనూనె గ్యాస్ సిలిండర్ పాల ధరలు పెరుగుతుండడంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో అచ్చే దిన్ లు వస్తాయని చెప్పిన పాలకులు ప్రజలు ఇప్పుడు అప్పుల పాలుకు చేరుకున్నారని తెలిపారు. గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్య ప్రజలకు అందని స్థాయికి చేరుకున్నాయని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఈ విధంగా నష్టపోతున్నారని తెలిపారు. వినియోగదారులకు మాత్రం అధిక ధరలకు ఎందుకు అమ్ముతున్నారని నిలదీశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు ధరలను కూడా నియంత్రించక లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యా వైద్యం రవాణా వంటి మౌలిక సేవలు సామాన్యులకు భారంగా మారడానికి కారణమైన ప్రభుత్వాలు తమ విధి నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు దిగజారుతున్న పాలకులు ప్రచార అర్భాటాలు మాత్రం కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. ఇకనైనా పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలని పెట్రోల్ డీజిల్ గ్యాస్ ద్వారా తగ్గించాలని పేద మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జూన్ 10వ తేదీన ఉదయం 11 గంటలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు కార్మికులు రైతులు యువత మహిళలు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు ,సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి. స్వరూప నాయక్, ఏఐటిసి మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు కోదాసులు జయమ్మ, డి. మల్లిక, సిహెచ్ మాధవి, తదితరులు పాల్గొన్నారు



# సండే ఆన్ సైకిల్‌తో ఫిట్‌నెస్ సందేశం

- **సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యవంతులవుతారు**

**ఎన్ ఎఫ్ సి కమాండెంట్ బైరెడ్డి శంకర్రావు**

**కుషాయిగూడ, మహా :** ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సీఐఎస్ఎఫ్ యూనిట్ ఎన్ఎఫ్సి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక 'సండే ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాండెంట్ శంకరరావు బైరెడ్డి, డిప్యూటీ కమాండెంట్ జై శంకర్ సింగ్ నాయకత్వంలో జరిగిన సైకిల్ ర్యాలీ కుషాయిగూడ, ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్, డీఏఈ కాలనీ ప్రాంతాల మీదుగా సుమారు 15 కిలోమీటర్ల మేర సాగింది.
ర్యాలీలో 100 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బందితో పాటు 50 మంది కుటుంబ సభ్యులు, చిన్నారులు పాల్గొని ఉత్సాహంగా సైక్లింగ్ చేశారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యకర జీవనశైలి, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమాండెంట్ శంకరరావు బైరెడ్డి మాట్లాడుతూ.. సైక్లింగ్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అత్యంత ప్రభావవంతమైన వ్యాయామమని పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌ను జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, ఇటువంటి కార్యక్రమాల్లో సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు నిరంతరం పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని ప్రదర్శించారని అధికారులు తెలిపారు.

# తమిళ రాజకీయాల్లో ప్రకంపనలు

**చెన్నై, మహా. :** తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య, అత్యంత కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటించారు. జూన్ 5వ తేదీన కమలం పార్టీతో బంధం తెంచుకున్న ఆయన, సరికొత్త దిశలో అడుగులు వేస్తూ *'వీ ది లీడర్'* పేరుతో ఒక నూతన ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆలోచనలు, సిద్ధాంతాల స్ఫూర్తితో ఈ వేదికను తీర్చిదిద్దినట్లు ఆయన ప్రకటించారు. ఈ నూతన ఆవిష్కరణకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. ప్రారంభించిన కొద్ది గంటల వ్యవధిలోనే వెబ్‌సైట్ ద్వారా లక్షలాది మంది ఈ ఉద్యమంలో సభ్యత్వం స్వీకరించడం విశేషం.
*కలాం సిద్ధాంత పాఠశాల ఆధ్వర్యంలో..*
తమిళ సమాజానికి చెందిన గొప్ప జాతీయ నాయకుడు అబ్దుల్ కలాంను దేశభక్తి, అంకితభావం, కఠిన శ్రమ, సమైక్యతలకు నిలువెత్తు ప్రతీకగా అన్నామలై అభివర్ణించారు. ఆ మహనీయుని పేరుతో కోయంబత్తూరు కేంద్రంగా 'కలాం సిద్ధాంత పాఠశాల'ను స్థాపించనున్నారు. నైతికత, రాజకీయాల అధ్యయన కేంద్రంగా రూపుదిద్దుకోనున్న ఈ వేదిక.. దానికి అనుబంధంగా పనిచేస్తూ యువతలో ప్రజా నాయకత్వ వికాసానికి, పరిశోధనలకు, శిక్షణకు ప్రధాన వేదికగా నిలవనుంది. కలాం ఆలోచనలను కేంద్రబిందువుగా చేసుకుని తమిళనాట ఒక సరికొత్త రాజకీయ సంభాషణకు అన్నామలై నాంది పలికారు.

## అధిక ధరలు మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై
# కళాజాత కార్యక్రమాలు

**కుషాయిగూడ, మహా:** అధిక ధరలు మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై కళాజాత కార్యక్రమాలు రూపొందిస్తామని మేడ్చల్ జిల్లా ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు వై నాగేశ్వరరావు పేర్కొన్నారు. జవహర్ నగర్ లో తెలంగాణ ప్రజానాట్యమండలి మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశం కె. ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వై. నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై నేడు జరుగుతున్న రాజకీయ పరిణామాలపై




ముఖ్యంగా అధిక ధరలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై కళాజాత కార్యక్రమాలు రూపొందిస్తున్నామని తెలిపారు. యువతపై మత్తుమందుల ప్రభావం తదితర అంశాలపై కళారూపాలు తయారు చేస్తామని తెలిపారు. జూలై మొదటి వారంలో జిల్లా స్థాయి పాటలు, నాటికలు, శిక్షణ శిబిరాలు జవహర్ నగర్ లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బి. వెంకటాచారి, అధ్యక్షురాలు ప్రమీల, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షులు రాములు, నరసమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వామపక్ష పార్టీల కృషితో గ్రామీణ ఉపాధి హామీ పథకం

- **ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చిన విబిజి రాంజీ.?**
- **సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్**
- **వ్యవసాయ కార్మిక సంఘం చేవెళ్ల మండల అధ్యక్షకార్యదర్శులుగా మహేందర్, రాజు ఎన్నిక**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**
ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యూపీఏ 1లో వామపక్ష పార్టీల కృషితో వచ్చిందని, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో పేదరిక నిర్మూలన కోసం ఆరోజు కమ్యూనిస్టు నాయకులు పార్లమెంట్లో పోరాటం చేసి చట్టం ఏర్పాటుకు కృషి చేశారని గుర్తుచేశారు. కానీ నేటి బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరు గారిచే విధంగా విబిజి రాంజీ అని పేరు మార్చి నిధుల కోత విధిస్తున్నారని, ఆన్లైన్ విధానం ఫోటో తీసుకువచ్చి సర్వర్ పని చేయక కార్మికులు ఉపాధి హామీ పనులకు దూరం కావాలని దురుద్దేశంతో దుర్మార్గమైన ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. అనంతరం నూతన వ్యవసాయ కార్మిక సంఘం కమిటీని ఎన్నుకోవడం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం చేవెళ్ల మండల అధ్యక్షులుగా చనువల్లి గ్రామానికి చెందిన మహేందర్, కౌకుంట్ల గ్రామానికి చెందిన రాజును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. మహిళ కన్వీనర్లుగా ఉషారాణి, భారతిలను, 12 మందిని మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవలసిన బాధ్యత ఉపాధి హామీ కూలీలపై ఉన్నదని. పెండింగ్ బిల్లులపై పెద్ద ఎత్తున వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ చేవెళ్ల మండల కన్వీనర్ జంగయ్య వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నర్సింలు, శ్రీనివాస్, ఏ అంజనేయులు, వెంకటేష్, రామచంద్రయ్య, కిష్టయ్య, స్రవంతి తదితరులు పాల్గొన్నారు

ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 08-06-2026



## ఫిడేల్ కాస్ట్రోకు

ఫిడేల్, ఫిడేల్ , ప్రజలు కృతజ్ఞులు
చేత లోని మాటలకు, పాడే పనులకు.
అందుకే నా దూర దేశం నుంచి తెచ్చా ఈ మధు పాత్ర
ఇది అడుగునున్న జనాల రక్తం ,చెమట నుంచి తయారు
వారు శతాబ్దాలుగా గడ్డ కట్టిన నేల నుంచి నిప్పు తీసిన గని కార్మికులు
బొగ్గు కోసం సముద్ర లోతుల్లోకి పోయి
బయటకు వచ్చినపుడు అనిపిస్తారు దయ్యాలు:
శాశ్వత చీకటి జీవులు, పగటి కాంతికి దూరులు
ఈ మధు పాత్ర నిండా ఎన్నో వెతలు
చీకటికి, భ్రమలకు బందీలైన వారి సంతోషాలు
వారు గనుల లోతుల్లో నుంచి పసిగడతారు
ఆగామి ఉదాత్త వసంత ఋతు పరిమళాలు
ఎందుకంటే వారికి తెలుసు
మనిషి పోరాడుతున్నది అత్యంత స్పష్టత కోసమని.
క్యూబాను చూస్తున్నారు దక్షిణాది గని పనివారు,
పంపా మైదానాల ఒంటరి తనయులు,
పెటగోనియా శీతల ప్రాంత పశు కాపరులు,
వెండి , తగరం జనకులు,
రాగిని చూకీకమాటా నుంచి తవ్వేందుకు
పర్వత శ్రేణులను పరిణయమాడినవారు,
నిర్మలమైన గత స్మృతులు కల జనం మధ్య దాగిన వారు
పొలాల్లో, కార్ఖానాల్లోని శ్రామిక మహిళలు,
తమ బాల్యాన్ని రోదనలో పోగొట్టుకున్న పిల్లలు:
అందుకో ఆ నిండు ఆశా పాత్రను ఫిడేల్
దాన్ని తాగితే తెలుస్తుంది నీకు నీ గెలుపు
నా దేశం లో తయారైన పాత మదిర లాంటిదని
దీన్ని తయారు చేసింది ఒకరు కాదు పెక్కురు
ఒక ద్రాక్ష నుంచి కాదు పలు మొక్కల నుంచి:
ఒక చుక్క కాదు అసంఖ్యాక నదీ నదాలు:
ఒక కెప్టెన్ కాదు ఎన్నో కదనాలు.
అందరి మద్దతు నీకే
నీవు దీర్ఘకాలిక సమరంలో సమిష్టి గౌరవ ప్రతినిధివి
క్యూబా కూలితే మేమూ రాలిపోతాం,
ఆమెను లేవనెత్తేందుకు మేము వస్తాం,
ఆమె విరులన్నింటితో వికసిస్తే
మేమిచ్చే అమృతంతో వర్ధిల్లుతుంది.
ఎవరైనా నీ చేత విముక్తమైన
క్యూబా నుదురును తాక సాహసిస్తే
వారికి ఎదురయ్యేది జనం పిడికిళ్లు
దాచిన మా ఆయుధాలు పైకి తీస్తాం
మా రక్తం, గర్వం వస్తాయి ముందుకు
మా ప్రియమైన క్యూబాను కాచేందుకు.

**మూలం : పాబ్లో నెరుడా**
**అనువాదం : డా.జె.రవీంద్రనాథ్**

## ఒక వేకువ పిట్టజాడ కోసం

ఇంకిపోయిన కండ్లబావుల్లోంచి
తోడుకుంటూ తోడుకుంటూ ఏడుస్తున్నది
దుఃఖ తడిలేని వయసులో.
ఎంత గగ్గోలు పెడితేమాత్రం
తిరిగిరాని పిలుపుకోసం
ఎన్ని చీకటిదారుల్లో చూపుల్ని
కాపలా పెడితేఏమి
ఇప్పటిదాకా
నా కంటూ ఒకడున్నాడని
కుడికన్ను గాయపడితే
ఎడమ కన్ను నడిపించేట్లు
ఒక నమ్మకం, ఒక బరోసా
బతుకును నీరెండకు వెచ్చబరిచేఆసరా...
ఇపుడు
ఎండా కాలం పెల్లల కిందిపరిగెలేరినట్లు
ఎన్ని పొద్దుల్ని మలిపేసిచూసినాఏమిలాభం
అతనిదారులుమూసేషారనిఆమెకేంతెలుసు
తాగేనీళ్లచెంబులో
పడుకునేమంచంలో తినేకంచంలో
అతని రూపమే
అతను పక్కనున్నట్లు
వీరగాథలు చెవిలో పోస్తున్నట్లు
మెతుకు మెతుక్కు అతని గుండెబలం
దండిగా కనబడుతున్నది
పులుల నోట్లో తల దూర్చి తరిమినోడు
సింహాల తోక పట్టిగిరగిరాతింపి
బండకేసికొట్టినోడు
దారిచూపించిన చేతికర్రే
మడుగులోకిగుంజుకెళ్లినట్లు
గడియ వేసిమూసిన తలుపులే
దొంగలకు దారిచూపినట్లు
అతడు కత్తులకు పిడిగుద్దులకు
ఫుట్ బాల్ లా అటూ ఇటూ దొర్లిదొర్లి
గాలి లేని బెలూన్ అయ్యిండని
ఇక రాడని ఆమెకేం తెలుసు
గుడిసెపైఏ పిట్టచప్పుడు చేసినా
వాకిట్లో ఏ దూడ దుమ్ము లేపినా
వాడేఐనట్లు
వాడిని తలుచుకుంటూ ఏడ్చి ఏడ్చి
తానేఒక దుఃఖ శిలలా...

**డా. ఉదారినారాయణ,**
**9441413666.**

# కాక్రోచ్ స్పీకింగ్

నేను ఈ దేశ రక్తాన్ని
నేను ఈ దేశ ఉవ్వెత్తున ఎగిసే కలల ఉష్ణపాతాన్ని
నేను ఆకాశాన్ని ముద్దుపెట్టుకునే సముద్రాన్ని

నేను
బొద్దింకను
నా జాతి గొంతునై మాట్లాడ్తున్నా

స్వచ్ఛ భారత్ పాట పాడ్తూ
కంపు కొడ్తున్న మనుషులు
దేశాన్ని
చెత్తతో నింపేస్తున్నప్పుడు

భూమి పుట్ట బ్రద్ధలై
కోట్లకు కోట్లై
నేను మురుగు శుభ్రం చేసే జన్మనై నాను
దేశం మురుగులో మునకేయకుండా
కాపాడే కంకణధారి కాక్రోచ్ను నేను

ప్రశ్నగుర్తుఓటు ఉరితీయబడ్తున్నా
తలారికీ చేయందించిన
మత్తిల్లిన యువతకు
ఊడిగపు పడిగాపు స్వరాల
నెత్తురంటిన న్యాయం మంటలంటుకున్నాకా
లేచిన నిప్పు కణికనీ
నిజమైన పరాన్న జీవుల
పొట్టల్ని బహిర్గత పరిచే శరాన్ని

బొద్దింకల తయారీ దారులే
బొద్దింకల ఉనికి పై ఉమ్మి వేస్తే
తయారీ దారుల ముఖాలన్నీ ఉమ్మి సముద్రాలవుతాయి

ఇవ్వాళ
నేను ప్రశ్న రూపాన్ని
ఇవ్వాళ
నేను యువత రూపాన్ని
ఇవ్వాళ
నేను ప్రళయ రూపాన్ని

మతం పేరుతో
కులం పేరుతో
దేశాన్ని మురుగ బెడ్తే

దేవుని పేరుతో
గుళ్ళ పేరుతో
దేశాన్ని కుళ్ళ బెడ్తే

పాకిస్తాన్ పేరుతో
కాశ్మీరు పేరుతో
దేశాన్ని చెత్త డంపుయార్డు చేస్తే

జిహాద్ పేరుతో
ముస్లిం పేరుతో
దేశాన్ని పేడ పురుగులమయం చేస్తే

సర్ పేరుతో
డీ లిమిటేషన్ పేరుతో
దేశాన్ని మురికి స్వర్గం చేయాలని చూస్తే

సహనాన్ని
నట్టనడి దేశంలో పగలగొట్టిన బొద్దింకను
నేను బుద్దింకను

మొసలి కన్నీళ్ళ ముంచీ ముంచీ
యువత సాలెగూళ్ళై
బల్లులు గుడ్లు పెట్టె ప్రదేశాలై
పగుళ్ళు పడ్డ సముద్రాలై
నెత్తురు చల్లబడ్డ అంటార్కిటికాలై
రోడ్డు పక్క దుబ్బ పేర్కపోయిన
చెడిన వాహనాలై
డాలరు కాలు కింద నేలమట్టపు రూపాయై
దేశమంతా చచ్చిన పశువుల దుర్గంధమై వీస్తున్నప్పుడు

నేను బొద్దింకను మాట్లాడ్తున్న
నేను బుద్దింకను మాట్లాడ్తున్న

నా చేతులు ఖాళీ చేశారు
నా ఆశలు ఖాళీ చేశారు
నా కలలు ఖాళీ చేశారు
నా భవిష్యత్తూ ఖాళీ చేశారు
నా కడుపు ఖాళీ చేసి
రోడ్డుపక్క పూటకూలి వరస నిలబెట్టారు

గుజరాత్రుల్ని మర్చి పోలేదు
ఉత్తరభారత దళితవాడ ఆర్తనాదాల్ని మర్చి పోలేదు
ఢిల్లీ వీధుల నెత్తుటి సాక్ష్యాలూ మర్చి పోలేదు
మణిపూర్ నగ్నదేహపు ఊరేగింపూ మర్చి పోలేదు
దండకారణ్య నెత్తుటి తుఫాన్నూ మర్చిపోలేదు

గుండెలోని దేశభక్తి
కాళ్ళ కింద పల్లేరు కాయై విస్తరిస్తోంది

ప్రశ్నిస్తే
దేశభక్తి వెంటాడుతోంది
ప్రశ్నిస్తే
దేశ ద్రోహం వెంట పడ్తోంది
ప్రశ్నిస్తే
అర్బనక్సలైట్ తొడుగు వేలాడ్తుంది
ప్రశ్నిస్తే
ఊపా ఊసరవెల్లై నాలిక చాస్తుంది
ప్రశ్నిస్తే
ఎన్నైఏ ఈడి వావివరసలు మరచి పోతాయి
ప్రశ్నిస్తే
జైళ్ళనోళ్ళు తెరిచి ఆవురావురమంటాయి

ధర్మం హంతకురాలైంది
న్యాయం మురిగి పోయింది
ఎన్నికల కమీషన్ మెదడు మాయమైంది
ప్రజలసొమ్ము తిని
పందులు బలుస్తున్నాయి

ఇవియంలు గెలిపిస్తున్న
పెట్టుబడిదారుల రాజ్యాల వలల్లోంచి
నేను కళ్ళు తెరుస్తున్నాను
వ్యవస్థల మీద కూర్చొని తింటున్న
మురికి సింహాసనాన్ని
కొరికి తినే బొద్దింక నేను
బుద్దింక నేను

వొక చీకటి తరాజు
వొక తుఫాను కేంద్రం సృష్టించింది

ఉడుకు రక్తం చుట్టూ
వొక నీచమైన పోలిక చుట్టి
నోటి నిండా దుర్వాసన యువ దేశం కక్కింది

అయినా
బొద్దింక ఇవ్వాళ మాట్లాడం కొత్తకాదు
బొద్దింక ఏళ్ళ తరబడి చలన శీలమైనదే!

దేశం కోసం
యవ్వనాల్ని బలి చల్లిన
భగత్సింగ్ ఒక బొద్దింక
ఆజాద్ చంద్ర శేఖర్ ఒక బొద్దింక
రాజ్ గురు ఒక బొద్దింక
సుఖ్ దేవ్ ఒక బొద్దింక
బొద్దింక మాట్లాడడం కొత్త కాదు

నన్ను కరుణించమని
సముద్రం
ముక్కుమూసుకొని తపస్సు చేయదు

తీరంలో
నీ పాదాలు నాకినంత మాత్రాన
మెడల గొల్సుతో
నీ ఇంటి ముందు నిల్చోదు

నువ్వు మొరిగినంత మాత్రాన
భయంతో
తనలోకి తను ముడ్చుకోదు

నీ నవ్వు లోని
మారిన రంగుల్ని లెక్కలతో
మనసు నిండా నింపు కుంటుంది

శపించదు
కోపగించదు
ప్రకృతి తో సంభాషిస్తుంది
నీ చీకటి మాటల చెరిగి
సారాన్ని వడ కడుతుంది

సముద్రం
ప్రశాంతంగానే
మారిపోయిన తాత్పర్య రాగాన్ని
గుండెలో
అగ్గి రాజేసుకుంటుంది

నల్లబడిన చేతుల్ని
ఎర్రబడిన చేతుల్ని
నువ్వు మళ్ళీమళ్ళీ తూడ్చుకుంటావు
తూడ్చిన మలినాల్ని
సముద్రం మీదే చల్లి ఆనందిస్తావు

గొల్సు
నీ చేతిలో ఉందనుకొని
సముద్రాన్ని గొరగొర గుంజుతుంటావు

ఎంతకీ కదలని సముద్రం
ప్రపంచం జలదరించే హోరెత్తి
యవ్వనలలతో
నిన్ను పాదాల కిందికి తోసుకొని
నీ కక్కుర్తి సంతకాల సొట్టు తీస్తుంది

గర్వంతో ఎగిసి పడే
నీ పర్వతాల్ని ముంచెత్తి
నా జెండా ఎజెండా ఎగురుతుంది

తరతరాల సముద్ర సంగీతధ్వనుల్లో
అదిలాబాద్ అడవుల్లో
చెట్టూపుట్టను రగిలించి
కొండల్ని కాగడాలుగా మండించిన
కొమరంభీం ఒక బొద్దింక

విశాఖ మన్యం మంటల్లో
తెల్లదొరలను కమిరిచ్చిన
అల్లూరి ఒక బొద్దింక

తెలంగాణ బొద్దింకలు
నిజాం గద్దెను నమిలేసిన
తెలంగాణ రైతాంగ పోరు వెలుగులు

నక్సల్బరి బొద్దింకల
పసి వెలుగులు

శ్రీకాకుళం కొండల్లో
యువనెత్తుటి బొద్దింకల సాయుధ వెలుగులు

69 ప్రసవించిన
తెలంగాణ సాయుధ
పోరాటం
బొద్దింకల వెలుగులే

దండకారణ్యం మణిపూర్
కాశ్మీర్ ఢిల్లీ
బొద్దింకలు బొద్దింకలు

బొద్దింక ఒక బుద్దింక
పాలకుల పాపాల దుర్మార్గాల కుతంత్రాల
సకల చెత్తను శుభ్రం చేసే
సకల చెత్త ఎత్తివేసే
సకల చెత్త బూడిద చేసే
మానవీయ యంత్రం బొద్దింక నేను

బానిస సంకెళ్ళ విధ్వంసిస్తూ
మ్రోగుతున్న
నిర్మాణ నేపథ్య సంగీతాన్ని నేను

**వడ్డెబోయిన శ్రీనివాస్**
**9885756071**

# "రాత్రిసింఫని" ఒక సార్వత్రిక మానవ హృదయనాదం

డాక్టర్ బాణాల శ్రీనివాసరావు ఆధునిక తెలుగు కవిత్వరంగంలో తనదైన విశిష్ట ముద్రను వేసిన కవి. ఆయన కవితాసంపుటి 'రాత్రి సింఫని' సమకాలీన సామాజిక, తాత్విక, అస్తిత్వ స్పృహల సమాహారం. ఆంగ్లసాహిత్య నేపథ్యంతో పాటు దేశీయ, ప్రాంతీయ మూలాల పట్ల అవగాహనతో రాసిన ఈ కవితల్లో వస్తు వైవిధ్యం, అద్భుతమైన అభివ్యక్తి శిల్పం గోచరిస్తాయి. ఈ సంపుటిలో ఆ పేరుతోనే ఒక కవిత ఉంది. 'సింఫనీ' అంటే రకరకాల వాయిద్యాల కలయికతో పుట్టే ఒక సుదీర్ఘమైన, గంభీరమైన సంగీత రచన. రాత్రి అనేది కేవలం నిశ్శబ్దం కాదు, అందులో ఎన్నో శబ్దాలు, భావాలు, దృశ్యాలు దాగి ఉన్నాయి. వాటి కలయికే ఈ కవిత. ఇది నాలుగు విభిన్న దశల్లో సాగింది. మొదటి భాగం ప్రశాంతత యాంత్రికత ల మధ్య సంఘర్షణను చిత్రిస్తుంది. "ఆ గది గూటిలో అలసిపోయి / హాయిగా నిదురిస్తున్నరెండు చిన్ని పక్షులు" ఇది ఒక అందమైన, సున్నితమైన గృహ వాతావరణాన్ని చూపిస్తుంది. కానీ వెంటనే "సముద్ర హోరును తలపించే నిరంతరం సింఫని సంగీతం" అంటూ పక్కనే ఉన్న ఫ్యాన్ శబ్దమో లేదా ఏసీ శబ్దమో... ఆధునిక జీవితపు యాంత్రిక హోరును ప్రకృతితో పోల్చిన తీరు అద్భుతం. రెండవ భాగం 'రాత్రి రక్షణ/సహజత్వాన్ని కవిత్వీకరిస్తుంది. వీధి కుక్కల అరుపులను కేవలం శబ్దంగా కాకుండా, "నిదురించే కాలనీని నిద్ర లేపుతున్న" ఒక హెచ్చరికగా, రాత్రి వేళ కాపలాగా అభివర్ణించడం నిత్యజీవిత సత్యాన్ని ఆవిష్కరించింది. మూడవ భాగంలో ఆర్ద్రత మనోవేదనను పలికిస్తుంది. ఇక్కడ కవిత్వం మరింత లోతుకు వెళ్ళింది. ఆకాశాన్ని సముద్రంతో, చందమామను ఒంటరి నావికుడితో పోల్చడం క్లాసిక్ ఇమేజరీ ."అక్కడో పచ్చి బాలింత / అలిసిపోయి పడుకుంది / పాలకోసం పసిపాప గుక్కపెట్టి ఏడుస్తున్నట్లు..."రాత్రి వేళ వినిపించే ఏడుపు లేదా ఏదో ఒక ఆర్తి, నిద్రపట్టని కవి మనసును మెలిపెట్టడం ఇక్కడి భావోద్వేగాన్ని పెంచింది. బాహ్య ప్రపంచం నుంచి కవి అంతరంగంలోకి ప్రయాణం ఇక్కడ కనిపిస్తుంది. నాల్గవ భాగంలో ఆశావహ దృక్పథం మేల్కొలుపు లోకి తీసుకెళ్తుంది. చీకటి పలచబడటాన్ని "వెలుగుమొగ్గలు విచ్చుకుంటున్న నిశ్శబ్ద పరిమళం" అనడం ఎంతో నవ్యమైన భావ చిత్రం. కాంతికి పరిమళాన్ని ఆపాదించడం కవితకు హైలైట్. అంటే ఒక ఇంద్రియ అనుభూతిని మరొక దానితో పోల్చడంలో కవి ప్రతిభ కనిపిస్తుంది. 'రెండు' బదులుగా "రొండు", "సందమామ", అనకుండా "చందమామ" అనే పదాల్ని ప్రయోగించడం బహుశా గ్రామీణ/జానపద శైలిని సహజత్వం కోసం కావాలనే వాడారేమో. అయితే, కవిత మొత్తం ఆధునిక/వచన శైలిలో సాగింది. కవిత్వనిర్మాణ పరంగా గుర్తించాల్సిన ఇలాంటి ప్రయోగాలు ఎన్నో ఉన్నాయి.

కవి కేవలం తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మాత్రమే కాక, ప్రపంచీకరణ సృష్టించిన సంక్షోభాలను కూడా కవిత్వీకరించారు. "అరచేతిలో గ్లోబు", అమెరికా ఎలా "గ్లోబల్ నేరస్థుడు"గా మారుతుందో అద్భుతంగా వర్ణించాడు. కవి ప్రకృతి నియమాలతో కవితను ప్రారంభిస్తూ, "లేడిని పులి వేటాడటం" అనేది ఒక సహజమైన ప్రకృతి ధర్మమని చెప్పారు. కానీ, ఆధునిక ప్రపంచంలో శక్తివంతమైన దేశాలు తమ స్వార్థం కోసం బలహీన దేశాలపై ఆధిపత్యం చలాయించడాన్ని 'ప్రాంతీయ ధర్మం', 'అంతర్జాతీయ ధర్మం' అంటూ అందమైన పేర్లతో సమర్థించుకోవడాన్ని కవి ఈసడించుకుంటారు. "లేడిని పులివేటాడితే! /ప్రకృతిధర్మం/ ఒక ప్రాంతానింకో/ ప్రాంతం ఆక్రమిస్తే!/ ప్రాంతీయధర్మం/ ఒకదేశాన్ని/ మరోదేశం కబలిస్తే/ అంతర్జాతీయ ధర్మం/దేశాధ్యక్షున్ని కూలదోసి/ఆ దేశన్యాయస్థానం



లో/ నేరస్థున్ని చేసి/ మరణ శిక్షవేయించి మట్టుబెడితే /ఇది ఏ ధర్మం? అనిఅమెరికా అగ్రాధిపత్యాన్ని ప్రశ్నించి, దానికి అది చేస్తున్న "అంత్యతాధునిక ఆయిల్ ధర్మమా!" అని ఆ దేశ అనైతికతను వ్యంగ్యంగా ఎత్తి చూపిస్తాడు . చివరికి "ఓ గ్లోబల్ నేరస్థుడా! "అని సంబోధిస్తూనే ఏదొక నాడు బలవంతమైన సర్పం కూడా "చలిచీమల చేచిక్కిన పాములా" ఆ దేశం ఇతర దేశాల చేతుల్లో పడి చావక తప్పదని భవిష్యదర్శనాన్ని చూపిస్తున్నాడు కవి. ఎంతటి శక్తివంతమైన శత్రువైనా, ప్రపంచ ప్రజలంతా ఏకమైతే లొంగక తప్పదని చెప్పడానికి "చలిచీమల చేచిక్కిన పాములా" అనే అద్భుతమైన సామెతను ప్రతీకగా వాడారు. అమాయక ప్రజల కన్నీళ్లు ఊరికే పోవని, ఆ "కన్నీటి అక్షరాలతో" ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు రాసే 'మరణశాసనాన్ని' ఏ గ్లోబల్ నేరస్థుడూ తప్పించుకోలేడని కవి సామ్రాజ్యవాద శక్తులకు తీవ్ర హెచ్చరిక జారీ చేశాడు కవి.

తన పుట్టిన ఊరుని, తల్లిదండ్రుల పట్ల ఉన్న గాఢమైన అనుబంధాన్ని అమ్మ ప్రేమలోని అనంతతత్వాన్ని"అమ్మొక సముద్రం" కవితలో ఆవిష్కరించారు. "మమ్మల్నిలా బతకనీయండిరా!", "బహుజనం", "వలసజీవులు" వంటి కవితలు సమాజంలో అణచివేతకు గురవుతున్న శ్రమజీవుల, వలస కార్మికుల పక్షాన గొంతును వినిపిస్తాడు.

తన ఊరిలో చూసిన భజనలు, తోలుబొమ్మలాటలు, అమ్మ పాడిన బతుకమ్మ పాటల లయ ఒకవైపు.. ఆంగ్ల సాహిత్య పఠనం ద్వారా అబ్బిన అంతర్జాతీయ ఆధునిక దృక్పథం మరోవైపు వీరి కవిత్వ శైలిని సుసంపన్నం చేశాయి. నిశ్శబ్దాన్ని శబ్దంగా మార్చడం, ఆవేదనను అక్షరబద్ధం చేయడంలో వీరి శైలి విశిష్టమైనది.

బాణాల గారి కవిత్వంలో వస్తువు దానిని వ్యక్తపరిచే శైలి, శిల్పం రమణీయంగా ఉంటాయి. కీట్స్, వర్డ్స్వర్త్ లతో పాటు అమెరికన్ బీట్ కవులు, తెలుగు దిగంబరకవుల ప్రభావం వీరి అభివ్యక్తిని మరింత పదును పెట్టింది.

సమాజంలోని రుగ్మతలను, మనుషుల అంతరంగిక మథనాన్ని వస్తువుగా స్వీకరిస్తూనే, వాటిని అత్యంత కళాత్మకమైన, హృద్యమైన అభివ్యక్తితో కవిత్వంగా మలుస్తూ సందర్భానుసారంగా అద్భుతమైన ప్రతీకలను, భావచిత్రాను ఉపయోగిస్తారు. "నీటినిప్పు", "వెన్నెలశిల్పం" వంటి పదబంధాలు వారి సృజనాత్మక అభివ్యక్తికి అద్దం పడతాయి.

"పర్గేటోరియో స్వాగతం" కవిత కవిత్వ ఆంతర్యాన్ని, దాని సామాజిక బాధ్యతను, వర్తమాన సాహిత్య విమర్శలోని లోపాలను అత్యంత ప్రగతిశీల, తాత్విక కోణంలో విశ్లేషిస్తుంది. పర్గేటోరియో' (Purgatorio) అనేది ఇటాలియన్ మహాకవి డాంటే అలిఘేరి రాసిన ప్రపంచ ప్రసిద్ధ కావ్యం "ది డివైన్ కామెడీ" (The Divine Comedy) లోని రెండవ భాగం పేరు. క్రిస్టియన్ (కథోలిక్) మత విశ్వాసాల ప్రకారం, మరణం తర్వాత ఆత్మలు నేరుగా స్వర్గానికో, నరకానికో వెళ్ళే ముందు తాము చేసిన పాపాలను పశ్చాత్తాపంతో కడుక్కొని, తమను తాము శుద్ధి చేసుకునే మధ్యంతర స్థలాన్ని 'పర్గేటరీ' లేదా ఇటాలియన్ భాషలో 'పర్గేటోరియో' అంటారు. ఇక్కడ ఆత్మలు బాధలను అనుభవిస్తూనే, చివరికి పవిత్రతను సాధించి స్వర్గానికి వెళ్ళడానికి అర్హత పొందుతాయి. కవి ఈ పదాన్ని ఒక శక్తివంతమైన రూపకం (Metaphor)గా వాడుకున్నారు. కవి దృష్టిలో వర్తమాన సాహిత్య విమర్శ, సమాజం ఒక సంక్షోభంలో ఉన్నాయని భావిస్తున్నాడు. కేవలం అలంకారాలు, ప్రతీకలతో రాసే బాధ్యతారహితమైన కవిత్వాన్ని కాకుండా, సమాజంలోని దోపిడీని ఎండగట్టే నిబద్ధ కవిత్వాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందంటాడు. సమాజంలో లేదా సాహిత్యంలో పేరుకుపోయిన కల్మషాన్ని, నిస్సహాయతను వదిలించుకుని, బాధ అంతర్మథనం ద్వారా సరికొత్త చైతన్యాన్ని, పవిత్రతను పొందే ప్రక్రియకు 'పర్గేటోరియో' ఒక ప్రతీకగా ప్రయోగిస్తూ కవిత్వం బాధ్యతాయుతంగా ఉండాలని భావిస్తున్నాడు కవి. "సుప్తచేతనలోని కలల అలలు కరిగితే కవిత్వమా?" అని ప్రశ్నిస్తూ, కవిత్వం అనేది కేవలం మనస్సులోని అంతర్గత కలలు, ఊహల నుండి మాత్రమే పుట్టదని స్పష్టం చేశారు. కవిత్వంలో సామాజిక నిబద్ధత అనేది అబద్ధం కాదని, సమాజం నుండి పారిపోయి ముక్కు మూసుకుని తపస్సు చేసే కవులుగా కాకుండా, వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెట్టాలని కవి పిలుపునిచ్చారు. "బాధలోంచి వచ్చే భావమే కవిత్వం! వేదనలోంచి వచ్చే నాదం కవిత్వం!!" అని మనిషి అనుభవించే బాధ, శ్రమజీవుల అంతరంగ వేదనల నుండి పుట్టే నాదమే నిజమైన కవిత్వమని, అది సమాజానికి సింఫనిలా వినిపించాలని ఈ పంక్తుల ద్వారా నిరూపించారు. ఇది కేవలం కవిత్వవిశ్లేషణ మాత్రమే కాదు, కవుల సామాజిక బాధ్యతను గుర్తుచేసే ఒక గొప్ప సాహిత్య మేనిఫెస్టో. ఈ సంపుటి లోని కవిత్వం, సామాజికస్పృహ రెండూ మిళితమై ఒకేసారి హృదయాన్ని పల్లవింపజేస్తూనే, మెదడుని ఆలోచింపజేస్తుంది కూడా.

'రాత్రి సింఫని' సంపుటి సమకాలీన తెలుగు కవిత్వరంగంలో ఒక వైవిధ్యభరితమైన, ఆలోచనాత్మకమైన మైలురాయి. ఈ సంపుటి కేవలం సామాజిక రుగ్మతలను ఎత్తిచూపే వేదిక మాత్రమే కాదు; ఇది అంతర్జాతీయ రాజకీయ సంక్షోభాలు, గ్లోబలైజేషన్ తెచ్చిన విచ్ఛిన్నత మొదలుకొని మనుషుల అంతరంగిక వేదనలు, అస్తిత్వ ఆరాటాల వరకు ప్రతి అంశాన్ని స్పృశించిన ఒక సమగ్ర జీవన దర్పణం. సాంప్రదాయ మూలాల పట్ల గౌరవం, ఆంగ్ల సాహిత్య పరిజ్ఞానంతో కూడిన ఆధునిక దృక్పథం కలగలిసిన వీరి శైలి తెలుగు కవిత్వానికి సరికొత్త నవ్యతను చేకూర్చింది. కవిత్వంలో నిబద్ధతను చాటుతూనే, బాధను భావంగా, వేదనను నాదంగా మలిచిన ఈ 'సింఫని'. పాఠకుడిని ఆనందింపచేస్తూ ఒక నూతన సామాజికతాత్విక చైతన్యం వైపు నడిపిస్తుంది. చీకటి లాంటి వర్తమాన సంక్షోభాలను చీల్చుకుంటూ మానవత్వం, శాంతి అనే తెల్లపావురాల ఆశావహదృక్పథాన్ని ప్రకటించిన 'రాత్రిసింఫని' అక్షరరూపం దాల్చిన ఒక సార్వత్రిక మానవ హృదయనాదం.

(ప్రీచర సునీతారావు స్మారక సాహిత్య పురస్కారాన్ని 'రాత్రిసింఫనీ' కవితా సంపుటికి ప్రకటించిన సందర్భంగా...)



**-ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**
**99896 28049**

## కుక్కిన పేను

ట్రంపు మోనార్కు
విశ్వంలో వాడి మార్కు
ప్రగతి డార్కు...

యు యస్ ఏ నేత
ఆక్టోపస్ జలచరం
దేశనేతల చెర...

వాడికి బలం
ఆయుధ కర్మగారం
ఉడకని పప్పులు
తగాదాలే ధ్యేయం...

పేరుకు అగ్రరాజ్యం
కోరదు శాంతి ప్రయాణం
ఎక్కడో ఓ మూల
దాని రక్తపు మరక...

అణు ఇంధనం
తనకే సొంతం
ఉంటే యుద్ధ తంత్రం
డాలర్ విలువ
పడిపోతుందని భయం...

ప్రపంచ దేశాలు
ఏకతాటిపై వస్తే
డాలర్ పతనమై
ఆయుధాలు త్రుప్పు పడితే
కుక్కిన పేనులా
పడి ఉంటాడు
బుద్ధుడే దిక్కంటాడు

**రేడియమ్**
**9291527757**

## అసలైన అడవి..!

ఇది అసలైన అడివి..
చల్లదనం, తేమదనం లేని ఎడారిలాంటి అడవి..
వీచే గాలుల మధ్య మధ్య విస్తరిస్తున్న జన పదాలు!
ఇది ఎప్పుడు ఎక్కడ మొదలైందో తెలియదు.

పిడికిలి బిగించి అలజడిలో కదలిపోవడం
కత్తులకు వత్తుల్ని వేల్లాడదీసి ప్రయాణించడం
పట్నం నుండి పల్లెకు! పల్లె నుండి అడవికి నడిచే
పాదాల పగుళ్ళు..
ఈ కథ వినేవారెవర్వరూ? అంతా పోరాటమే!

వసంతం ముందున్నా, కోయిల రాగాలుండవు
వర్షం కురుస్తున్నా, ఆశల చివుళ్ళు కనిపించవు..
అందుకే ఈ కథ పూర్తి కాదు!
అడవి మనుషుల నుంచి భయం పోదు!

శిఖరాలు ఎన్ని అధిరోహించినా
ఎన్ని శిలా శాసనాలు చెక్కించినా
మనసులోంచి అడవితనం పోకుంటే ఏం
ప్రయోజనం?
ఇంకా సాక్ష్యం కావాలా? స్పష్టత లేని మాటల్లా..!



**శైలజామిత్ర**
**9290900879**

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

# పాత పోడు భూముల జోలికి వెళ్లొద్దు

- ఫారెస్ట్ అధికారులకు ఎమ్మెల్యే పాయం హెచ్చరిక
- 30 ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములపై ఇబ్బందులు పెట్టొద్దు
- –ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- కొత్త పోడు కొట్టవద్దని గిరిజనులకు సూచన



**బూర్గంపహాడ్, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాక పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం, పాయం ఎస్టీ కాలనీ, మోతేపట్టి నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని చింతకుంట, ఇరవైండి పంచాయతీలోని కోస గుంపు 3 గిరిజన గ్రామాల ప్రజలు సాగు చేస్తున్న పోడు భూముల విషయంలో ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూడు గిరిజన గ్రామాల ప్రజల సమక్షంలో ఫారెస్ట్ అధికారులతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చరవాణి ద్వారా మాట్లాడారు. సుమారు 30 సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల జోలికి వెళ్లవద్దని, వారి సాగుకు ఆటంకాలు కలిగించవద్దని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. అదేవిధంగా గిరిజన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం సాగు చేస్తున్న పోడు భూములను మాత్రమే సాగు చేసుకోవాలని, కొత్తగా పోడు భూములను కొట్టవద్దని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపురం ఎస్టీ కాలనీ పెద్దమనిషి సోడే చంద్రయ్య, చింతకుంట గ్రామ పెద్దలు సోలోమోన్, సీతారాం పాల్గొన్నారు



# త్రెడ్ పోచంపల్లి చేనేత వస్త్ర ప్రదర్శనకు చివరి రోజు భారీగా సందర్శకులు

**హైదరాబాద్/ యాదాద్రి భువనగిరి జూన్ 7 మహా**
పోచంపల్లి చేనేత వస్త్ర కళాకు ప్రత్యేక గుర్తింపు ఉందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రోజు ముగింపు కార్యక్రమానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి చేతుల మీదుగా ఎగ్జిబిషన్ లో స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు త్రెడ్ పోచంపల్లి హైటెక్స్‌లో నిర్వహించిన చేనేత వస్త్ర ప్రదర్శనకు మూడు రోజుల పాటు సందర్శకులు భారీగా తరలివచ్చారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ప్రదర్శనలో ఉంచిన చేనేత వస్త్రాలు, పోచంపల్లి ప్రత్యేక ఉత్పత్తులు, చేతి వృత్తిదారుల కళాఖండాలను ఆసక్తిగా వీక్షించి కొనుగోలు చేశారు. ప్రదర్శనలో మహిళలు, యువత, ఉద్యోగులు, చేనేత అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోచంపల్లి చేనేతకు ఉన్న ప్రత్యేకతను ప్రతిబింబించే చీరలు, డ్రెస్ మెటీరియల్స్, హోమ్ ఫర్నిషింగ్ ఉత్పత్తులు, సంప్రదాయ హస్తకళ వస్తువులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో కొనుగోలుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సందర్శకులు మాట్లాడుతూ, చేనేత ఉత్పత్తులను నేరుగా తయారీదారుల నుండి కొనుగోలు చేసే అవకాశం లభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా చేనేత కార్మికులకు ప్రోత్సాహం లభించడంతో పాటు వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. మూడు రోజుల పాటు విజయవంతంగా సాగిన ఈ చేనేత వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రదర్శనలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సందర్శకులు నిర్వాహకులను కోరారు. చేనేత రంగాభివృద్ధికి ఈ తరహా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, జడ్పీ సీఈవో శోభారాణి,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఏడి జౌళి చేనేత అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.










## తప్పిపోయిన మతిస్థిమితం లేని మహిళ

**బూర్గంపహాడ్, మహా:** సారపాకకు చెందిన మతిస్థిమితం సరిగా లేని మహిళ గత నెల 14వ తేదీ నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, సారపాకకు చెందిన పద్మావతి అనే మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. మహిళ భర్త సతీష్ తెలిపిన వివరాల ప్రకారం, గత రెండు మూడు రోజులుగా ఆమె మణుగూరు ప్రాంతంలో తిరుగుతున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందిందన్నారు. అయితే ఇప్పటివరకు ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆమె ఎక్కడికి వెళ్లిందో తెలియక కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళను ఎవరైనా గమనించినా లేదా ఆచూకీ తెలిసినా వెంటనే కుటుంబ సభ్యులకు 9550847360 కి సమాచారం అందించాలని కోరుతున్నారు.

## బూర్గంపాడులో చేపమందు పంపిణీకి సర్వం సిద్ధం

**బూర్గంపాడు, మహా:** మృగశిర కార్తి సందర్భంగా బూర్గంపాడులో చేపమందు పంపిణీకి సర్వం సిద్ధమైంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాదిలో ఈరోజు చేపమందు పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఉపసం, శ్వాస సంబంధిత మరియు ఇతర గొంతు సంబంధ సమస్యల కోసం ప్రతి సంవత్సరం హైదరాబాదులో చేపమందు పంపిణీ నిర్వహిస్తుండగా, అదే తరహాలో బూర్గంపాడులో కూడా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. బూర్గంపాడులోని సులేమాన్ బజారులోసులేమాన్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఈ చేపమందు పంపిణీ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా వివిధ గ్రామాలు, మండలాల నుంచి ప్రజలు చేపమందు కోసం బూర్గంపాడుకు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.



# కాలం మార్చలేని బంధం

- 22 ఏళ్ల తర్వాత కలిసిన బాల్య మిత్రులు
- పాములేరులో ఆత్మీయంగా న్యూస్కాలర్ కాన్వెంట్ స్కూల్ 2004 బ్యాచ్ సమ్మేళనం

**బూర్గంపహాడ్, మహా:** జీవిత ప్రయాణంలో ఎన్నో మలుపులు వచ్చినా, బాల్య స్నేహం మాత్రం ఎప్పటికీ చెదరని అనుబంధమనే విషయాన్ని న్యూస్కాలర్ కాన్వెంట్ స్కూల్, మొరంపల్లిబంజర్‌కు చెందిన 2004 ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు మరోసారి నిరూపించారు. దాదాపు 22 ఏళ్ల తర్వాత పాములేరులో నిర్వహించిన ఆత్మీయ గెట్ టు గెదర్ కార్యక్రమంలో పాల్గొని చిన్ననాటి జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు పాఠశాల ఆవరణలో కలిసి చదువుకుని, ఆడిపాడిన స్నేహితులు నేడు ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో బిజీ జీవితాలు గడుపుతున్నప్పటికీ, పాత స్నేహబంధం పిలుపుతో మళ్లీ ఒకేచోట చేరి భావోద్వేగ క్షణాలను పంచుకున్నారు. పాఠశాల రోజుల సరదా సంఘటనలు, గురువుల బోధనలు, సహచరులతో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా పరస్పరం కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుంటూ, జీవితంలో ఎంత బిజీగా ఉన్నా స్నేహబంధాన్ని కొనసాగించాలని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలను తరచూ నిర్వహిస్తూ అనుబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాలం గడిచినా స్నేహానికి వయస్సు ఉండదని, నిజమైన స్నేహం ఎప్పటికీ చెదరదని ఈ కలయిక మరోసారి చాటిచెప్పింది. స్నేహం, ఆత్మీయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచిన ఈ సమావేశం పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా మిగిలింది. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, సంధ్యారాణి, చంద్రశేఖర్ రెడ్డి, మౌనిక, శైలజ, అనంత్, శ్రవణ్, చంటి, రఘురామిరెడ్డి, కృష్ణారెడ్డి,

# కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు ఉధృతం

**గుర్తింపు సంఘం కేంద్ర కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఆదివారం జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కేంద్ర కౌన్సిల్ సమావేశం తొలి రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసంగించారు. సింగరేణి సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు సంక్షేమం ఉద్యోగ భద్రతకు విఘాతం కలిగించే విధానాలను యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావలసిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కొత్త గనుల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని నిలిచిపోయిన మెడికల్ బోర్డులను పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు ప్రమోషన్లు క్లర్క్ పోస్టుల భర్తీ డిస్మిస్ అయిన కార్మికులకు ప్రత్యేక అవకాశం కల్పించడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నెల గోలేటి నుంచి కొత్తగూడెం వరకు నిర్వహించిన సింగరేణి జాత విజయవంతం కావడంలో సహకరించిన కార్మికులు నాయకులు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మిక వ్యతిరేక విధానాలు పెరుగుతున్నాయని విమర్శించారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించాలని స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. సహజ మరణం పొందిన కార్మికుని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అన్ని పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నాయకులు కోరారు. సమస్యల పరిష్కారంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు యూనియన్ నాయకుడు కొమురయ్య కాంస్య విగ్రహ పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, వై.వి.రావు, ముస్కే సమ్మయ్య, సెంట్రల్ సెక్రటరీలు వంగ వెంకట్, వీరస్వామి, వివిధ ఏరియాల బ్రాంచ్ కార్యదర్శులు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కిషోర్ నాయక్ పర్యటన

**రాజీవ్ నగర్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి హామీ.. ప్రజల్లో హర్షం**

**బూర్గంపహాడ్, మహా:** సారపాక గ్రామ సర్పంచ్ కిషోర్ నాయక్ ఆదివారం సెలవు దినాన్ని కూడా లెక్కచేయకుండా ప్రజా సేవకే అంకితమయ్యారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన ఆదివారం గ్రామంలోని పలు కాలనీల్లో విస్తృతంగా పర్యటిస్తూ స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్ నగర్ కాలనీని సందర్శించిన సర్పంచ్ అక్కడి ప్రజలతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలను విన్న వెంటనే స్పందించిన సర్పంచ్, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. విద్యుత్ శాఖ ఏఈతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కాంట్రాక్టర్లతో మాట్లాడి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సర్పంచ్, ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. సెలవు రోజున కూడా స్వయంగా కాలనీల్లోకి వచ్చి సమస్యలు తెలుసుకుని, వెంటనే స్పందించి పరిష్కార చర్యలు ప్రారంభించడంపై రాజీవ్ నగర్ కాలనీ ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.

# పోలీస్ తనిఖీల్లో 12 కిలోల ఎండు గంజాయి పట్టివేత

**మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్న క్రమంలో తేదీ 7 6 2026 ఆదివారం మట్వాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వరంగల్ హంటర్ రోడ్డులోని ఏడు మోరీల జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా రెండు సూట్‌కేసుల తో వెళ్తున్న ఇద్దరు మహిళలను గుర్తించి తనిఖీ చేయగా, వారు పోలీసు వాహనాన్ని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని వెంటాడి అదుపులోకి తీసుకొని విచారించారు.
వివరాల్లోకెళ్తే .....
నిందితురాల వివరాలు.. ఒకరు త్రివేణి రామనాథ్ ఘోడ్కే, వయస్సు 26 సంవత్సరాలు, నివాసం పూణే, మహారాష్ట్ర, మరొకరు అంజలి రామ్ సాథే, వయస్సు 25 సంవత్సరాలు, నివాసం పూణే, మహారాష్ట్రగా నిందితురాళ్లు తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వరంగల్ మున్సిపల్ కార్యాలయం నుండి పంచులను పిలిపించి, క్లూస్ టీం సిబ్బంది ని సంఘటనా స్థలానికి రప్పించి, పంచుల సమక్షంలో చట్టబద్ధంగా తనిఖీ నిర్వహించగా, వారి వద్ద ఉన్న రెండు సూట్‌కేసులలో మొత్తం ఆరు ప్యాకెట్లలో నిల్వ ఉంచిన 12 కిలోల ఎండు గంజాయి లభించింది. ప్రతి ప్యాకెట్‌ను విడిగా పరిశీలించి, డిజిటల్ త్రాసు సహాయంతో తూకం వేయగా ఒక్కో ప్యాకెట్ సుమారు 2 కిలోల చొప్పున ఉండగా, మొత్తం 12 కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు నిర్ధారించబడింది. పంచుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకొని, నమూనాలు సేకరించి, సీజ్ ప్రక్రియ పూర్తి చేయబడింది. విచారణలో నిందితురాళ్లు పూణే, మహారాష్ట్ర నుండి ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే బీజేష్ వ్యవన్, అలియాస్ సోనీ అలియాస్ మానిష్‌సహూ వద్ద రూ. 60 000 చెల్లించి 12 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేసి, పూణేకు తరలించే క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గమనించి భయపడి రైలులో నుండి దిగిపోయి, రైల్వే స్టేషన్ వెనుక మార్గం ద్వారా తప్పించుకొని కాజీపేట వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా మట్వాడ పోలీసులకు పట్టుబడినట్లు ఒప్పుకున్నారు. నిందితురాళ్ల వద్ద నుండి ఎండు గంజాయి కొనుగోలు రవాణాకు ఉపయోగించిన రెండు మొబైల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్లూస్ టీం సిబ్బంది మొత్తం ప్రక్రియను ఫోటోలు, వీడియోల రూపంలో నమోదు చేయగా, వాటిని కూడా కేసు ఆస్తిగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 12 కిలోల ఎండు గంజాయి మార్కెట్ లో విలువ సుమారు రూ. 6 00 000 (ఆరు లక్షలు) గా పోలీసులు అంచనా వేశారు. నిందితురాళ్ల పై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగిందని మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, కొనుగోలు, అమ్మకం, నిల్వ అలాగే వినియోగం పై వరంగల్ పోలీస్ కమిషనరేట్ కఠిన చర్యలు కొనసాగిస్తోందని, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాల పై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100, 112కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు

# గోదాం నిర్మాణంలో రాజకీయాలు

- గుట్ట మట్టి అమ్ముకుంటున్నారని ఆరోపణ
- గ్రామంలో గోదాం చిచ్చు



**కారేపల్లి, మహా :** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గుట్టకిందగుంపులో గోదాం నిర్మాణం చిచ్చు రాజేసింది. గ్రామం వద్ద నిర్మిస్తున్న 15వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ లో ఉన్న రాజకీయ విభేదాలు తెర మీద కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ లోని ఒక వర్గం గోదాం నిర్మించాలని పట్టుపడుతుండగా రెండో వర్గం గోదాం నిర్మాణానికి ససేమిరా అంటుండంతో గోదాం నిర్మాణం జరుగుతుందా అనే నియమాంస మండల ప్రజలలో నెలకొంది. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.985.50కోట్లతో గుట్టకిందగుంపు సమీపంలోని గంగదేవి గుట్టపై 15వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి 4వతేదిన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తో కలిసి శంకుస్థాపన చేశారు. గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేయకముందే గుత్తేదారు గుట్ట వద్ద పనులు ప్రారంభించి మట్టిని ఇష్టానుసారంగా అమ్మకాలు సాగించారు. అక్రమ మట్టి అమ్మకాలపై సర్పంచ్ ఉండం రాఘవులు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. ఈ ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ కి చెందిన జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు బహిరంగంగానే మద్దతు ప్రకటించారు. గోదాం నిర్మాణానికి గ్రామపంచాయతీ నుండి ఎలాంటి అనుమతులు లేవని, గుట్ట తవ్వకాలతో పురాతన దేవాలయమైన గంగమ్మ తల్లి గుడికి నష్టం కలుగుతుందని గ్రామస్తులు. గుట్టవద్ద గోదాం పనులు ప్రారంభించిన ప్రతిసారి కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో కొందరు గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ జోక్యం చేసుకొని గోదాం నిర్మాణంతో స్థానిక యువకులకు ఉపాధి దొరుకుతుందని ఆ ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చెబుతుందని గ్రామపంచాయతీ పాలకవర్గానికి వివరించారు. దీంతో సర్పంచ్ ఉండం రాఘవులు గుట్టకిందగుంపు వద్ద నిర్మాణానికి పాలకవర్గాన్ని ఒప్పించారు. దీంతో 4వతేదిన గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దానితో పాటు గుట్టకిందగుంపులో అభివృద్ధి పనులను సైతం ప్రారంభించారు.

**గోదాం నిర్మాణం పై రెండు గా చీలిన గ్రామం**

గోదాం నిర్మాణంపై గుట్టకిందగుంపు రెండు గా చీలింది. గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడంతో నిర్మాణం మార్గం సుగమయిందని తలచిన నేపథ్యంలో ఆదివారం గుత్తేదారు గుట్ట వద్ద పనులు ప్రారంభించగా మరోసారి గ్రామస్తులు ఇమ్మడి తిరుపతిరావు నాయకత్వంలో అడ్డుకున్నారు. గంగాదేవిగుట్టను గోదాం పేరుతో త్రవ్వి కాంట్రాక్టర్ మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సహజ సిద్ధ ప్రకృతికి నిలయమైన గంగాదేవి గుట్టను నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని గ్రామస్థులు జెసిబి ని అడ్డుకొని పనులు చేయకుండా నిలిపి చేయించారు. ఎటువంటి అనుమతులు లేకుండా పట్టపగలు గుట్టను త్రవ్వి సదరు కాంట్రాక్టర్ మట్టిని అమ్ముకుంటున్నారని, దానిపై అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గుట్టకింద గుంపు వద్ద మట్టి దందా ఆపకపోతే తహసిల్దార్ ఆఫీస్ ముందు బైఠాయించి ఉద్యమం చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు. గోదాం పనులకు అనుకూలంగా, వ్యతిరేకంగా గుట్టకిందగుంపు గ్రామస్తులు రెండుగా విడిపోయారు. గోదాం నిర్మాణం ఆదివాసీగుంపులో రాజకీయ చిచ్చు పెట్టింది. అది ఏ పరిస్థితి కి దారితీస్తుందోనని గ్రామస్తుల ఆందోళన చెందుతున్నారు.




## సమస్యల పరిష్కారం కోసం వినతి

**తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యల పరిష్కారం కోరుతూ డిమాండ్**

**బూర్గంపహాడ్, మహా** బూర్గంపహాడ్ మండలం టేకులచెరువు గ్రామపంచాయతీలో నిర్వహించిన 'నా ప్రజా పాలన' కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సిఐటియు మండల కన్వీనర్ పాండవుల రామనాథం అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాభివృద్ధి, రైతు సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులపై అధికారులకు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగు మరియు వరి విత్తనాలు మారుమూల ప్రాంతాల్లో నివసించే చిన్న, సన్నకారు రైతులకు సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నిజమైన రైతులకు విత్తనాలు చేరేలా ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని సూచించారు. అలాగే సమావేశానికి హాజరైన ఏఈ దృష్టికి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తీసుకెళ్లారు. మిషన్ భగీరథ నీళ్లు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ఎండా కాలంలో తాగునీటి సమస్య మరింత తీవ్రమైందని తెలిపారు. పైపులైన్ డ్యామేజ్ కారణంగా సరఫరా నిలిచిపోయిందని అధికారులు పేర్కొనగా, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియలో మొదటి విడతలో కొన్ని లోపాలు జరిగాయని పేర్కొంటూ, రెండో విడతలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే స్థలం లేని కుటుంబాలకు స్థలాలు కేటాయించి, వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల విషయంలో కూడా స్పందించిన ఆయన, అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు, ఒంటరి మహిళలకు మరియు వితంతువులకు పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో భూ సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని, ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్లు, భూముల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని జీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. భూ సర్వే నిర్వహించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు మరియు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు 'యంగ్ ఇండియా' గురుకులాలు ఒక పెట్టుబడి!

- లక్ష్మీపురం సమీకృత విద్యాలయ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.
- నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని అధికారులకు కఠిన ఆదేశాలు.
- పనుల్లో మరింత వేగం పెంచి, గడువులోగా పూర్తి చేయాలని సూచన.



**ఖమ్మం, మహా :** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యార్థులకు దేశంలోనే అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని అందించాలన్న సమున్నత లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల' నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్యాభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయినీ కేవలం వ్యయంగా చూడకూడదని, అది భవిష్యత్ తరాలను అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు పెడుతున్న ఒక అమూల్యమైన పెట్టుబడిగా భావించాలని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో శరవేగంగా సాగుతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల భవన నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.

**కాలి నడకన పనుల పరిశీలన.. నాణ్యతే గీటురాయి**

లక్ష్మీపురంలో విశాలమైన స్థలంలో నిర్మిస్తున్న ఈ గురుకుల విద్యాలయ ఆవరణలో ఉప ముఖ్యమంత్రి కాలి నడకన కలియదిరిగారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పరిపాలనా భవనం (అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్), జూనియర్, సీనియర్ విద్యార్థుల హాస్టళ్లు, తరగతి గదులు, ప్రయోగశాలల (ల్యాబ్స్) నిర్మాణ పనుల తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరతో పాటు వివిధ సంబంధిత శాఖల ఉన్నతాధికారులు డిప్యూటీ సీఎంకు పనుల పురోగతిని సవివరంగా వివరించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదిగా నిలిచే ఈ విద్యా సంస్థల నిర్మాణంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎక్కడా, ఏ దశలోనూ నాణ్యత విషయంలో రాజీపడటానికి వీల్లేదని తేల్చిచెప్పారు. నిర్మాణ పనులు నిరాటంకంగా, అత్యంత వేగంగా కొనసాగేలా చూస్తూ, ముందుగా నిర్దేశించుకున్న గడువులోగా భవనాలను అందుబాటులోకి తెచ్చేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.

**శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు**

కలెక్టర్, ఇతర అధికారులు పనుల పురోగతిని వివరిస్తూ.. పరిపాలనా భవనానికి సంబంధించి బ్లాక్ 2, 3, 4 ల్యాబ్ భవనాల జీ ప్లస్ వన్ స్లాబ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే బ్లాక్ 4లోని తరగతి గదుల జీ ప్లస్ టూ స్లాబ్ నిర్మాణాలు సైతం పూర్తయినట్లు తెలిపారు. సీనియర్ హాస్టళ్ల సముదాయంలో ఒక బ్లాక్‌లో గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ పనులు చురుగ్గా కొనసాగుతుండగా, మరో మూడు బ్లాక్‌లకు పునాది పనులు పూర్తి చేసినట్లు వివరించారు. ఇక జూనియర్ హాస్టళ్ల విభాగంలో రెండు బ్లాక్‌ల నిర్మాణం పూర్తి కాగా, మరో రెండు బ్లాక్‌ల పునాది పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ ఉన్నతస్థాయి క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లతో పాటు నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నేటి ప్రజావాణి రద్దు

**ఆదిలాబాద్ మహా :** జూన్ 8న సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహిస్తున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని సోమవారం ప్రజావాణి ఫిర్యాదుల నిమిత్తం ఎవరూ కలెక్టరేట్ కు రావద్దని ఆయన కోరారు.

## ఆహార భద్రత నిబంధనలను పాటించాలి

- ప్రజల ఆరోగ్యానికి హాని చేసే ఆహార పదార్థాలను కొనరాదు
- మంచిర్యాల జిల్లా ఆహార భద్రత అధికారి జి మహేష్

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో హోటళ్ళు, స్వీట్ షాపులు, బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నిర్వహకులు ఆహార భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఆహార భద్రత అధికారి జి మహేష్ అన్నారు. ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక నార్త్ ఇన్ హోటల్ లో హోటళ్ళు, స్వీట్ షాపులు, బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమానికి ఆహార భద్రత శాఖ డిజిగ్నేటెడ్ అధికారి బి వాసు రామ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి మాట్లాడుతూ ఆహార సంబంధిత వ్యాపారం చేసే వారందరూ భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార ఉత్పత్తులను తయారు చేయకూడదని హెచ్చరించారు. ఆహార ఉత్పత్తుల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. తాజా నిత్యావసర సరుకులను వినియోగించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం జరిగిందని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని వెల్లడించారు. ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో సంస్థల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 65 మంది ఎఫ్ బి ఓ లు, జిల్లా కేంద్రంలోని హోటళ్ళు, స్వీట్ షాపులు, బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## గంజాయి చాక్లెట్ల రవాణా కు చెక్ పెట్టిన పోలీసులు

### నిందితున్ని అరెస్టు చేసిన మట్వాడ పోలీసులు

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్వాడ పోలీస్ స్టేషన్ పోలీసులు గంజాయి చాక్లెట్ల అక్రమ రవాణా కు చెక్ పెట్టారు. వీటిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని అడ్డుకొని అరెస్టు చేసి గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. తేదీ 6 06 2026 తేదీ సాయంత్రం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు మట్వాడ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ శివకృష్ణ పోలీస్ స్టేషన్, సిబ్బంది డి. నాగరాజు పీసీ3690, బి. సత్యనారాయణ పీసీ 2574, పి. రవి పీసీ1288 లతో కలిసి మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఎంజీఎం జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని గుర్తించి తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న నలుపు రంగు బ్యాగులో చాక్లెట్ల రూపంలో గంజాయి పదార్థం ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా అతను తన పేరు జనార్ధన్ మాలిక్, తండ్రి ధనేశ్వర్ మాలిక్, వయస్సు 35 సంవత్సరాలు, నివాసం కాన్పాడా, భద్రక్ జిల్లా, ఒడిశా రాష్ట్రానికి చెందిన వాడని తెలిపాడు. ఈ సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు అందించి పంచులను, క్లూస్ టీంను సంఘటనా స్థలానికి రప్పించి చట్టపరమైన ప్రక్రియను చేపట్టారు. పంచుల సమక్షంలో విచారించగా నిందితుడు ఒడిశా రాష్ట్రానికి చెందిన తన పరిచయస్తుడు అంకిత్ పాణిగ్రహి వద్ద నుండి గంజాయి మిశ్రమంతో తయారు చేసిన చాక్లెట్లను కొనుగోలు చేసి వాటిని మహారాష్ట్ర రాష్ట్రంలోని సోలాపూర్ ప్రాంతంలో అధిక ధరకు విక్రయించి లాభం పొందాలనే ఉద్దేశ్యంతో తీసుకెళ్తున్నట్లు స్వచ్ఛందంగా ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద లభించిన గోల్డ్ కలర్ కవర్లలో ఏడు మైనర్ వాటి పేరుతో ఉన్న మొత్తం 72 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకోగా వాటి పై ముద్రించిన వివరాల ప్రకారం కానబిస్ సటైవా సహా పలు పదార్థాలతో తయారు చేసినట్లు గుర్తించారు. పంచుల తో పాటు పోలీసు సిబ్బంది సమక్షంలో పరిశీలించగా చాక్లెట్ల నుండి గంజాయికి ప్రత్యేకమైన ఘాటైన వాసన వస్తుండటంతో అవి గంజాయి మిశ్రమంతో తయారైనవిగా గుర్తించడం జరిగిందని ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు తెలిపారు.

## ఉత్సాహంగా 5కే రన్

- పాల్గొన్న ఎస్పీ, డీఎఫ్ఓ
- రన్ ఫర్ హెల్త్



**ఆదిలాబాద్ మహా:** వ్యాయామాన్ని నిత్య జీవన చర్యలో ఒక భాగం చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన '5K రన్' స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ పరుగును జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ తో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి కలెక్టర్ చౌక్, రాంనగర్ అక్కడి నుండి తిరిగి స్టేడియం వరకు ఉత్సాహ భరితంగా విజయవంతంగా సాగిన ఈ 5కే రన్ లో జిల్లా నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు, యువత స్థానిక ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ రన్నింగ్ చేయడం వల్ల శరీరానికి ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో ఆరోగ్యకరమైన జీవనం సాగించడం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామాలను తమ నిత్యజీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. నిరంతరం శారీరక శ్రమ చేయడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని, దీనివల్ల యువత సులభంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ మానసిక, శారీరక ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేకంగా పాటుపడాలని కోరారు. ఇదే సమయంలో జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ తరపున తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. యువత తప్పుడు మార్గాల్లో వెళ్లకుండా క్రీడలు, శారీరక శ్రమ వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. పురుషుల కేటగిరీ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా మాడవి భీమ్ రావ్, కె.ప్రణయ్, దక్ష్,మహిళల కేటగిరీ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పూజ, గంగోత్రి, వైశాలి విజేతలుగా నిలిచారు. వారికి ప్రథమ కింద రూ.5000, ద్వితీయ రూ.3000, తృతీయ రూ.2000 రూపాయల నగదు బహుమతులు, తరువాతి విజేతలకు కన్సోలేషన్ బహుమతులతో పాటు మెడల్స్ లను ఎస్పీ, డిఎఫ్ఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, డివైఎస్ఓ శ్రీనివాస్, ఎఫ్డీఓ అరవింద్, ఎఫ్ఆర్ఓలు రాథోడ్ అవినాష్, శీలానంద్, శ్రీనివాస్, అనిత, అటవీ, పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, యువత, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




## కొత్త ఉపాధి చట్టం వద్దు

- పాతదే కొనసాగించాలి
- ఉపాధి కూలీల పొట్ట కొట్టవద్దు
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మహాసభలు
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు డిమాండ్

**ఆదిలాబాద్ మహా** : గ్రామీణ పేదలను మరింత పేదలుగా మార్చి, ఉపాధి కూలీల జీవితాలను నిర్వీర్యం చేసేలా ఉన్న విబిజి రాం జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు డిమాండ్ చేసారు. పేద కూలీల పొట్ కొట్టేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్త ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. విబిజి రాం జి చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని పాత మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని భాశెట్టి మాధవరావు భవన్ లో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 4వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కామ్రేడ్ సుందరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించి, అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించి నివాళి అర్పించారు. పాత చట్టంతో కార్మికుల జీవన స్థితిగతులు కొద్దికొద్దిగా మెరుగవుతున్న క్రమంలో కొత్త చట్టాన్ని తెచ్చి వీరి బతుకులను ప్రశ్నార్థకం చేసారన్నారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ఆర్థికంగా బలోపేతం చేసే ఉపాధి చట్టం నిర్వీర్యం చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతూ పేదల నడ్డి విరుస్తూ భారాలు మోపుతుందని పేద ప్రజలపై ధరల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేసారు. జులై 1న దేశ వ్యాప్తంగా పాత ఉపాధి హామీ చట్టం పునరుద్దరణ చేయాలనే డిమాండ్ తో జరిగే దేశ వ్యాప్త నిరసనలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జూన్ 20,21,22 మహబూబ్ నగర్ లో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలకు త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ హాజరవుతున్నారని కూలీలు పేదలు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కార్యదర్శి లంకా రాఘవులు వ్యవసాయ కూలీల సమస్యలపై తీర్మానం ప్రవేశ పెట్టి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, కార్యదర్శి కిరణ్ ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెల్ల స్వామి, నాయకులు ఆశన్న, చింటూ, రాజక్క, ఎన్ పీఆర్డీ జిల్లా అధ్యక్షులు అరిఫా తదితరులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం తగదు: ఎస్పీ

- భీంపూర్ పోలీస్ స్టేషన్ సందర్శన
- సిబ్బందికి పలు సూచనలు



**ఆదిలాబాద్ మహా** : ప్రజలలో పోలీసు పట్ల ఉన్న నమ్మకం మరింత పెరిగేలా విధుల నిర్వహణ చేపట్టాలని, బాధితుల పట్ల, వారి సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మహారాష్ట్ర తో సరిహద్దుతో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలు అక్రమ రవాణా జరగకుండా మండలాన్ని ప్రశాంతంగా ఉండేవిధంగా పర్యవేక్షించాలని సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా ఆదివారం భీంపూర్ పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి పరిశుభ్రతపై దృష్టి సారించాలని, ప్రాంగణంలో ఒక మొక్కను నాటి పచ్చదనం ప్రాముఖ్యతను తెలియజేశారు. సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. మండలంలో మాదకద్రవ్యాలకు గంజాయి, దేశిదారు, లాంటి వాటికి దూరంగా ఉండే విధంగా ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. సిబ్బందిని విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని విధులలో జవాబుదారీతనం, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు అక్రమ రవాణా జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. బీటు వ్యవస్థను పటిష్టంగా అమలు చేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా వీపిఓ విధానాన్ని అమలు చేసి సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, గ్రామ గ్రామాన సమాచారం అందించే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని తెలిపారు. నేరస్తుల పట్టా కఠినంగా వ్యవహరిస్తూ ఉండాలని, నేరం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కోర్టుల నందు శిక్షలు పడే విధంగా చార్జి షీటును దాఖలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని వారి సమస్యలను త్వరితగతిగిన పరిష్కరించి న్యాయం చేసిన సందర్భంలో పోలీసుల పట్ల గౌరవం నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సిఐ జి శ్రావణ్, భీంపూర్ ఎస్ఐ బి పీర్ సింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో మంటలు పెట్టకండి

**కాంటెస్టెడ్ కార్పొరేటర్ బెడద వీరన్న**



మహా వరంగల్ బ్యూరో: రైతులకు చేతులు జోడించి నమస్కరిస్తున్న పండించే పంట పొలాల్లో పంట అవశేషాలను తగలపెట్టవద్దని కాంగ్రెస్ వరంగల్ తూర్పు బ్లాక్ అధ్యక్షులు కాంటెస్టెడ్ కార్పొరేటర్ బెడద వీరన్న రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో అవగాహన ఉన్న రైతన్నల ఈ మధ్య కాలంలో పంట సాగు చేయడానికి పంట దిగుబడి రావడానికి ఎన్నో రకాల ఎరువులు వాడి పంట దిగుబడి కొరకు భూమి బలం చేసుకున్న రైతులు ఈ మధ్యకాలంలో పంట కోసిన తర్వాత మొక్కజొన్న వరి పత్తి లాంటి పంటలను దిగుబడి వచ్చిన తర్వాత అలాగే ఉంచి వర్షాలు పడ్డ తర్వాత భూమికి బలం చేకూరే విధంగా గతంలో రైతన్నలు పల్టర్ తో భూమి చదును చేసుకుని భూమికి బలం చేకూరే విధంగా చేసుకునే వారని కాని ఈ మధ్యకాలంలో పంట భూములలో పంట అవశేషాలకు మంటలు పెట్టి భూములను బలం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుచేత రైతన్నలు ఈ విషయాన్ని గమనించి భూములలో మంటలు పెట్టే సంస్కృతికి స్వస్తి చెప్పాలని రైతన్నలను కోరారు. ఖిలా వరంగల్ మండల్ కిసాన్ సెల్ అధ్యక్షులు ఎసిరెడ్డి ప్రభాకర్ ఆధ్వర్యంలో పర్యవేక్షించిన ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు బొల్లుగోడు రఘు సుంచు వీరన్న నలివేల ఐలయ్య బిల్లా అమర్ బిల్లా రమేష్ బొలుగుడ్డు కోటి రిటైర్డ్ టీచర్ రైతు సత్యం కలకుట్ల కుమార్ కందిమల్ల భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

**-మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

మంచిర్యాల మహా : వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అధికారులను ఆదేశించారు. ఆదివారం కోటపల్లి మండలం దేవులవాడ, వేమనపల్లి మండలం గొర్లపల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో, దస్నాపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని వెల్లడించారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని త్వరితగతిన కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన వరి ధాన్యం తరలింపు కొరకు అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. అనంతరం వేమనపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో కలిసి వరి ధాన్యం తరలింపునకు కావలసిన రవాణా సౌకర్యానికి సంబంధించిన కార్యాచరణను పరిశీలించారు. రవాణా గుత్తేదారులతో చరవాణి ద్వారా మాట్లాడి అదనపు లారీలను కేటాయించాలని చెప్పారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా కొనుగోలు చేసిన వరి ధాన్యం యుద్ధ ప్రాతిపదికన ఈరోజు రాత్రి కల్లా తరలించి జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ముగిసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కొత్త కారు కొనాలనే వారికి గుడ్‌న్యూస్.. భారీ డిస్కౌంట్లు ప్రకటించిన కంపెనీలు!

**న్యూఢిల్లీ :** కొత్త కార్లను కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే ఇది మీకు శుభవార్త. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలు ఒకేసారి భారీగా రాయితీని ఇస్తున్నట్టు ప్రకటించాయి. మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్‌లు ఏకంగా తమ మాడళ్లపై రూ.2.15 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు వెల్లడించాయి. ఈ ఆఫర్లు ప్రస్తుత నెలకు మాత్రమే వర్తించనున్నాయని, వీటిని నగదు డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపింగ్ ఇన్సెంటివ్స్, లాయల్టీ రివార్డ్, కార్పొరేట్ ప్రయోజనాలు కలుపుకొని ఎంపిక చేసిన మాడళ్లపై రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపాయి.

**హ్యుందాయ్..**

హ్యుందాయ్ మోటర్స్ ఎంపిక చేసిన మాడళ్లపై లక్ష రూపాయల వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నది. క్రెటా ఎస్‌యూవీని కొనుగోలు చేసిన వారికి లక్ష రూపాయల వరకు డిస్కౌంట్ ఇస్తున్న సంస్థ..వెర్నాపై రూ.95 వేలు, అప్‌డేటెడ్ మాడల్‌పై రూ.55 వేలు, క్రెటా ఎలక్ట్రిక్ మాడల్‌పై రూ.85 వేల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని ఆటోకార్ ఇండియా తాజాగా వెల్లడించింది. వీటితోపాటు గ్రాండ్ ఐ10 నియోస్‌పై రూ.78 వేలు, అల్కాజర్‌పై రూ.75 వేలు, ఐ20, ఐ20 ఎన్ లైన్ మాడల్‌పై రూ.63 వేలు, ఎక్సటర్‌పై రూ.43 వేల డిస్కౌంట్, ఔరా మాడల్‌పై రూ.25 వేలు, వెన్యూపై రూ.5 ప్రయోజనాలు కల్పిస్తున్నది.

**టాటా మోటర్స్...**

పలు ప్యాసింజర్ వాహనాలపై రూ.55 వేల వరకు రాయితీ ఇస్తున్నట్టు టాటా మోటర్స్ ప్రకటించింది. ఈ ఆఫర్లు 2026లో విడుదలైన ఎస్‌యూవీలు, పంచ్, టియాగో మాడళ్లు ఉన్నాయి. వీటిలో నెక్సాన్‌పై రూ.55 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్న సంస్థ..కర్వ్‌పై రూ.55 వేలు, హారియర్, సఫారీ ఎస్‌యూవీపై రూ.45 వేల వరకు, అల్ట్రోజ్ రూ.40 వేల వరకు, టియాగోపై రూ.35 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది.


**మారుతి కార్లపై...**

మారుతి సుజుకీ కూడా రాయితీలను ప్రకటించింది. ఇన్విక్టో ఎంపీవీ పై రూ.2.15 లక్షల వరకు రాయితీ ఇస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. దీంతోపాటు గ్రాండ్ విటారాపై రూ.1.35 లక్షల వరకు, ఇగ్నిస్‌పై రూ.45 వేలు, బాలెనోపై రూ.40 వేలు, ఎక్స్ఎల్ఆర్‌పై రూ.45 వేలు, జిమ్నీపై రూ.45 వేలు, ఫ్రాంక్స్‌పై రూ.25 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. వీటిలో ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ రివార్డులు, కార్పొరేట్ డిస్కౌంట్లు ఇస్తున్నది.




## అంబానీని దాటేసిన అదానీ..

### ఆసియా కుబేరుల జాబితాలో తొలిస్థానం



**న్యూఢిల్లీ :** అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ మరో మెట్టు పైకి ఎక్కారు. అదానీ గ్రూపునకు చెందిన షేర్లు భారీగా పుంజుకోవడంతో గౌతమ్ అదానీ సంపద పెరిగి ఆసియా కుబేరుల జాబితాలో తొలిస్థానం దక్కించుకున్నారు. రిలయన్స్ గ్రూపు చైర్మన్ ముకేశ్ అంబానీ స్థానాన్ని వెనక్కినెట్టి అదానీ కైవసం చేసుకున్నారు. గౌతమ్ అదానీ సంపద 2.5 బిలియన్ డాలర్లు పెరిగి 89.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. 88 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపదతో ముకేశ్ అంబానీ ర్యాంక్ రెండో స్థానానికి పడిపోయింది. ఈ విషయాన్ని ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్ లిస్ట్ విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది.

## ఇక ఇష్టారీతిన ప్యాకింగ్ కుదరదు

### నిర్దిష్ట పరిమాణాల్లోనే వంటనూనెల ప్యాకేజింగ్

**న్యూఢిల్లీ :** వంటనూనెల కొనుగోలుదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. వివిధ బ్రాండ్‌ల ధరలను పోల్చి చూసుకోవడానికి, సరైన కొనుగోలు నిర్ణయాలు తీసుకోవడానికి వినియోగదారులకు సహాయం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వంటనూనెల ప్యాకేజింగ్ పరిమాణాన్ని తప్పనిసరిచేసింది. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వంటనూనెల కోసం ప్రామాణిక ప్యాక్ పరిమాణాలను నిర్దేశించింది. నూనెలు, నికర పరిమాణాన్ని నిర్ధారించడానికి సంబంధించిన తమ ప్రామాణిక నిర్వహణ విధానాన్ని(ఎస్‌వోపీ) సంబంధిత శాఖ ఈ సరికొత్త ఆదేశాలు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలను పాటించేందుకు తయారీదారులు, ప్యాకర్లు, దిగుమతిదారులకు మూడు నెలల సమయాన్ని కల్పించినట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. సవరించిన ఎస్‌వోపీ ప్రకారం తొమ్మిది ప్రామాణిక ప్యాక్ పరిమాణాలను నిర్దేశించింది. దీంట్లో 200 ఎంఎల్, 500 ఎంఎల్, లీటర్, 2 లీటర్లు, 3 లీటర్లు, 4 లీటర్లు, 5 లీటర్లు, 15 లీటర్లు, 20 లీటర్లలో వంటనూనెలు, పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్, మస్టర్డ్, పల్లీనూనె, రైస్‌బ్రాండ్, కాటన్‌సీడ్స్, కార్న్ ఆయిల్ లభించనున్నాయి. దేశంలోని వంటనూనెల రంగంలో దాదాపు 90 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాన పరిశ్రమల సంఘాలతో విస్తృత సంప్రదింపులు జరిపిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కొత్త నిబంధనల ప్రకారం..వంటనూనె




పరిమాణాన్ని ఘనపరిమాణంలో చూపినైట్టైతే.. లీటల్ మెట్రాలజీ రూల్స్2011 ప్రకారం ప్యాకేజీపై బరువును స్పష్టంగా పేర్కొనాలి. ఈ నూతన నిబంధనలు దేశీయంగా తయారైన వంటనూనెలతోపాటు దిగుమతి చేసుకుంటున్న నూనెలకు వర్తించనున్నది. 200 ఎంఎల్ కంటే తక్కువ స్థాయి సాచెట్లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపునిచ్చింది. ఈ సందర్భంగా దేశీయ వంటనూనెల తయారీదారుల సంఘం ప్రెసిడెంట్ సుధాకర్ దేశాయ్ మాట్లాడుతూ ..ఈ నూతన నిబంధనలను స్వాగతిస్తున్నట్టు, రిటైల్ వ్యవస్థాగత మార్కెట్లో అందరికి సమాన అవకాశాలను కల్పించనున్నట్టు చెప్పారు.

## నయా ఇన్నోవా క్రిస్టా

**బెంగళూరు :** టయోటా కిర్లోస్కర్ మోటర్..దేశీయ మార్కెట్‌కు నూతన ఇన్నోవా క్రిస్టాను పరిచయం చేసింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్‌ను టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసినట్టు, అలాగే కస్టమర్ కోరుకుంటున్న విధంగా డిజైన్ చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.19.72 లక్షల నుంచి రూ.26.63 లక్షల లోపు ధరను నిర్ణయించింది.




## చిప్‌ల తయారీకి రాష్ట్రం అనుకూలం

### ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించండి
### ఆ రాష్ట్ర బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్ :** సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని.. ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదురొనేలా ప్రపంచస్థాయి సదుపాయాలతో కూడిన సెమీ కండక్టర్ 'ఎకో సిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మలేషియా పెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం శనివారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. 'తెలంగాణ మలేషియా(పెనాంగ్)' మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ తదితర రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతున్నదని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదన్నారు.




## ట్రంప్ బృందం నుంచి తప్పకున్న ఏఐ సలహాదారు

*వైట్‌హౌస్ ఏఐ సలహాదారు శ్రీరామ్ కృష్ణన్ రాజీనామా చేశారు. ఈ నెలాఖరున పదవి నుంచి తప్పకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. డొనాల్డ్ ట్రంప్ పాలనలో శ్రీరామ్ కీలక పాత్ర పోషించారు. 18 నెలల పాటు ఆయన సేవలందించారు. తాను కొంతకాలం విరామం తీసుకుని,.. ఆ తర్వాత అమెరికా ఎదుర్కొంటున్న ప్రధాన ఏఐ సంబంధిత సవాళ్లపై తిరిగి పని చేస్తానంటూ ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.*



కృష్ణన్ ప్రభుత్వంలో తన సేవను జీవితకాలపు ప్రత్యేక హక్కుగా అభివర్ణించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో సేవ చేయడం గౌరవం. ఆయన నాయకత్వం లేకపోతే మనం ఏఐ రేసులో ముందంజలో ఉండేవాళ్లం కాదంటూ ఆయన పేర్కొన్నారు.

వైట్ హౌస్ ఏఐ, క్రిప్టో సలహాదారు డేవిడ్ సాక్స్‌కు కూడా ఆయన ధన్యవాదాలు తెలుపుతూ.. ఏఐ రంగంలో అమెరికా విజయం సాధించాలనే ఆయన నిరంతర మద్దతు ఎంతో కీలకమైందని.. అది కొనసాగుతూనే ఉంటుందన్నారు. తన పదవీకాలంలో తాను అభివృద్ధి చేయడంలో సహాయపడిన పలు కార్యక్రమాలను కృష్ణన్ ప్రధానంగా ప్రస్తావించారు.

వీటిలో అమెరికన్ ఏఐ యాక్షన్ ప్లాన్'ను రూపొందించడం, ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ ఏఐ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఏఐ యాక్సిలరేషన్ పార్టనర్‌షిప్‌లను ముందుకు తీసుకెళ్లడం, 'నేషనల్ ఏఐ పాలసీ ఫ్రేమ్‌వర్క్' ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌కు సహకారం అందించడం, అంతర్జాతీయంగా ఏఐ సదస్సులు, దౌత్యపరమైన చర్చల ద్వారా అమెరికన్ ఏఐ ప్రయోజనాలను ప్రోత్సహించడంలో తన పాత్రను కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. కృత్రిమ మేధస్సు వేగవంతమైన పరిణామంగా కృష్ణన్ పేర్కొన్నారు.

చెన్నైలో జన్మించిన కృష్ణన్.. ఎస్ఆర్ఎంఇంజనీరింగ్ కాలేజ్ నుంచి తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2005లో అమెరికాకు వెళ్లారు. కృష్ణన్ ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పెరిగారు. ఆయన తండ్రి ఇన్సూరెన్స్ రంగంలో పనిచేశారు. తల్లి గృహిణి. ఆయన 21 సంవత్సరాల వయస్సులో మైక్రోసాఫ్ట్ సంస్థతో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. అక్కడ ఆయన విండోస్ అజూర్ వ్యవస్థకు ఫౌండింగ్ మేనేజర్‌గా పనిచేశారు.

ట్రంప్ ప్రభుత్వంలో చేరడానికి ముందు, కృష్ణన్ 'ఆండ్రీసెన్ హోరోవిట్జ్' వెంచర్ క్యాపిటల్ సంస్థలో జనరల్ పార్ట్‌నర్‌గా ఉన్నారు. అంతకుముందు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో కూడా వివిధ హోదాల్లో పనిచేశారు. ముఖ్యంగా ఎలాన్ మస్క్ 'వార్ రూమ్'లో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్ నుండి 'ఎక్స్ గా మార్చే ప్రక్రియలో ఆయన సహాయం అందించారు.

## భార్య ప్రెగ్నెన్సీ బ్రేక్... వైరల్ అవుతున్న ఏఐ ప్లాన్!

**న్యూఢిల్లీ:** భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తున్నప్పుడు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. కానీ, ఫ్యామిలీ ప్లానింగ్ లేదా ప్రెగ్నెన్సీ కారణంగా భార్య ఉద్యోగానికి ఒకట్రెండేళ్లు బ్రేక్ ఇవ్వాల్సి వస్తే? ఒకేసారి వచ్చే ఆదాయం సగానికి పైగా తగ్గిపోతుంది సరిగ్గా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్న ఒక ఉద్యోగి, రూ. 22 లక్షల వార్షిక ఆదాయం ఉన్న తమ కుటుంబానికి సింగిల్ ఇన్‌కమ్‌తో ఎలా ప్లాన్ చేయాలని 'చాట్ జీపీటీ' ని ప్రశ్నించాడు. భార్య జీతం రూ. 12 లక్షలు (55శాతం), భర్త జీతం రూ. 10 లక్షలు అయినప్పుడు, ఆ సడన్ ఫైనాన్షియల్ షిఫ్ట్‌ను ఎలా తట్టుకోవాలో ఏఐ ఇచ్చిన మైండ్ బ్లోయింగ్, ప్రాక్టికల్ ఫైనాన్షియల్ ప్లాన్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది.



**బ్రేక్‌కు ముందే పక్కా ప్లానింగ్: ఫేజ్ 1**

భార్య ఉద్యోగానికి విరామం ప్రకటించడానికి 3 నుండి 12 నెలల ముందే కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ అవసరమని చాట్ జీపీటీ స్పష్టం చేసింది. ముందుగా 9 నుండి 12 నెలల కుటుంబ ఖర్చులకు సరిపడా 'ఎమర్జెన్సీ ఫండ్'ను లిక్విడ్ అకౌంట్లలో సిద్ధం చేసుకోవాలి. పర్సనల్ లోన్లు వంటి అధిక వడ్డీ అప్పులను వెంటనే తీర్చేయాలి. అత్యంత ముఖ్యంగా, మెటర్నిటీ బెనిఫిట్స్ ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్, పుట్టిన రోజు నుంచే శిశువుకు వర్తించేలా ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ తీసుకోవాలి. ప్రెగ్నెన్సీ ఖర్చుల కోసం సాధారణ డెలివరీకి రూ. 50 వేల నుండి రూ. 1.5 లక్షలు, ప్రీమియం ఆసుపత్రుల కోసం రూ. 2.5 నుండి రూ. 6 లక్షలు, అలాగే ఎమర్జెన్సీ ఎన్ఐసీయూ వార్డుల కోసం రూ. 3 నుండి రూ. 5 లక్షల బఫర్ ఫండ్‌ను ముందే దాచాలని ఏఐ సూచించింది.

**ఒకే జీతంతో నెట్టుకురావడం: ఫేజ్ 2**

కుటుంబ ఆదాయంలో 55శాతం మాయమైనప్పుడు అది కేవలం బడ్జెట్ సమస్య మాత్రమే కాదు, మానసిక ఒత్తిడికి కూడా కారణమవుతుంది. అందుకే హోమ్ బడ్జెట్‌ను సర్వైవల్, బ్యాలెన్స్‌డ్, కంఫర్టబుల్ మోడ్స్‌గా విభజించుకోవాలి. భర్తకు వచ్చే జీతాన్ని 'తన వ్యక్తిగత ఆదాయం'గా కాకుండా 'కుటుంబ ఆదాయం'గా భావించినప్పుడే భాగస్వాముల మధ్య అసంతృప్తి రాకుండా ఉంటుందని ఏఐ కీలక సూచన చేసింది. ఇంట్లో ఉండి పిల్లలను చూసుకునే భార్య శ్రమ నెలకు రూ. 15,000 నుండి రూ. 40,000 విలువైన ఆర్థిక శ్రమతో సమానమని గుర్తించాలి. ఇన్వెస్ట్‌మెంట్ల విషయానికి వస్తే, సిప్‌లను పూర్తిగా ఆపేయకుండా కొంతమేర తగ్గించుకుంటూ ఈక్విటీ కేటాయింపులను స్థిరంగా ఉంచుకోవాలి.

**మళ్లీ కెరీర్ రీ-ఎంట్రీ: ఫేజ్ 3**

ఉద్యోగానికి బ్రేక్ ఇచ్చే సమయం పెరిగేకొద్దీ కెరీర్ రిస్క్ కూడా పెరుగుతుందని చాట్ జీపీటీ విశ్లేషించింది. 12 నెలల బ్రేక్ ఉంటే రీఎంట్రీ జీతంలో 5 నుండి 15శాతం వరకు ప్రభావం ఉంటుంది. అదే 24 నుండి 36 నెలల బ్రేక్ అయితే నైపుణ్యాల క్షీణత ఎక్కువై, మళ్లీ ఉద్యోగంలో చేరడానికి ఫ్రీలాన్సింగ్, పార్ట్‌టైమ్ కన్సల్టింగ్ లేదా రీస్టార్ట్ ప్రోగ్రామ్స్ అవసరమవుతాయి. మూడు ఏళ్ల కెరీర్ బ్రేక్ వల్ల కోల్పోయే ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్లు, శాలరీ ఇంక్రిమెంట్లు, కాంపౌండింగ్ నష్టం దాదాపు రూ. 15 నుండి రూ. 25 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసింది. ఆధునిక పేరెంటింగ్ కల్చర్ చూపిస్తున్నంతగా పిల్లల పెంపకం ఖరీదైనది కాదని, కానీ సరైన ప్లానింగ్ లేని కెరీర్ బ్రేక్స్ ఆర్థిక భవిష్యత్తును దెబ్బతీస్తాయని ఏఐ తేల్చిచెప్పింది.

## నీట్ పరీక్ష భద్రత కోసం ఎన్‌టీఏ కీలక నిర్ణయం


**హైదరాబాద్:** ఈ నెల జూన్ 21న జరగనున్న నీట్ యూజీ పరీక్ష కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఏటువంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా తరలించేందుకు భారత వైమానిక దళాన్ని రంగంలోకి దించుతోంది. ఈ వివరాలను NTA డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ తెలిపారు. దీంతో ఒక పరీక్ష కోసం విమానాల్ని వాడిన ఎగ్జామ్‌గా నీట్ రికార్డు సృష్టించనుంది. నీట్‌పరీక్ష ఏర్పాట్లపై తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె. రామకృష్ణారావు నేతృత్వంలో జరిగిన వర్చువల్ సమావేశంలో అభిషేక్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షల పారదర్శకతను, భద్రతను కాపాడటానికి ఈసారి మునుపెన్నడూ లేని విధంగా అత్యున్నత స్థాయి భద్రతా ప్రోటోకాల్‌స్‌ను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అభిషేక్ సింగ్ మాట్లాడుతూ "పరీక్షా ప్రక్రియ సమగ్రతను, భద్రతను కాపాడటానికి ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో చెప్పడానికి ఇదే నిదర్శనం. ప్రశ్నపత్రాల రవాణా కోసం తొలిసారిగా భారత వైమానిక దళాన్ని ఉపయోగిస్తున్నాము" అని అన్నారు.కాగా వైమానిక దళ అంశంపై ఇటీవలే మాట్లాడిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ జూన్ నెలలో ఉండే వాతావరణ పరిస్థితులు, రవాణా ఇబ్బందులు, భద్రతా కారణాల దృష్ట్యా ప్రశ్నపత్రాలను సురక్షితంగా, సకాలంలో చేరవేసేందుకు వైమానిక దళ సహాయం తీసుకోనున్నట్లు ప్రకటించారు. అయితే కేవలం ప్రశ్నాపత్రాల కోసం మాత్రమే వైమానిక దళం సహాయం తీసుకుంటామని భద్రత కోసం మరే సాయం తీసుకోమని స్పష్టం చేశారు.గత మే 3న జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షను ప్రశ్నాపత్రాల లీకేజ్ వల్ల రద్దు చేస్తున్నట్లు మే 12న ఎన్‌టీఏ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జూన్ 21న దేశవ్యాప్తంగా తిరిగి పరీక్ష నిర్వహించనున్నారు.





## 6 నిమిషాల డాన్స్ కు 6 కోట్లు.. ఈ హీరోయిన్ డిమాండ్ మాములుగా లేదుగా..

టాలీవుడ్ మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. 'శ్రీ' సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ. దాదాపు రెండు దశాబ్దాలుగా టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ లలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది ఈ అమ్మడు.ప్రస్తుతం తన భారీ రెమ్యునరేషన్‌తో ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. గత కొన్నేళ్లుగా తమన్నా సినిమాలతో పాటు స్పెషల్ సాంగ్స్ ద్వారా ఫేమస్ అయ్యింది.ముఖ్యంగా రజనీకాంత్ 'జైలర్' చిత్రంలోని 'కావాలయ్యా' పాట ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. తాజాగా మరోపాటతో సంచలనం సృష్టించింది.అలాగే 'స్వింగ్ జరా', బాలీవుడ్ చిత్రం 'రైడ్ 2'లోని 'నషా' వంటి సాంగ్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేశాయి. అయితే ఈ పాటల సక్సెస్ ఆమె వాల్యూని పెంచేసింది.గోవాలో జరిగిన ఒక ప్రైవేట్ ఈవెంట్‌లో తమన్నా కేవలం 6 నిమిషాల స్టేజ్ డాన్స్ పెర్ఫార్మెన్స్ కోసం ఏకంగా 6 కోట్ల రూపాయల రెమ్యునరేషన్ తీసుకుందట.అంటే లెక్క ప్రకారం చూస్తే నిమిషానికి దాదాపు ఒక కోటి రూపాయలు వసూలు చేసినట్లయింది. ఒక చిన్నపాటి డాన్స్ షోకు ఈ స్థాయి మొత్తాన్ని అందుకోవడం చూసి ఆశ్చర్యపోతున్నారు.గతంలో 'జైలర్' సాంగ్ కోసం రూ.3 కోట్లు, 'రైడ్ 2' సాంగ్ కోసం రూ.5 కోట్లు తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. ప్రస్తుతం సినిమాలు తగ్గించిన ఆమె ఓటీటీలో బిజీగా ఉంటుంది.



## తెలుగులో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న రాధికా..

నేహా శెట్టి ఈ అందాల భామ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. మోడల్ గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ అయ్యింది. 2016లో కన్నడ సినిమా ముంగారు మలే 2తో సినీరంగంలోకి అడుగుపెట్టి ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఇక తెలుగులో మెహబూబా సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆతర్వాత గల్లీ రౌడీ, డీజే టిల్లు సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. మోడలింగ్ లోకి వచ్చిన నేహా, 2014లో మిస్ మంగళూరు అందాల పోటీతో గెలిచింది. మిస్ సౌత్ ఇండియా 2015 రన్నరప్‌గా నిలిచింది.ప్రస్తుతం నేహా శెట్టి సినిమాల స్పీడ్ తగ్గించింది. అందం అభినయం ఉన్నప్పటికీ ఈ ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు.మొన్నామధ్య పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది.. కానీ అది ఎడిట్ లో పోయింది. ఇటీవలే తమిళ్ సినిమా డ్యూడ్ లో నటించింది.ప్రస్తుతం సోషల్ మీడియాలో సెగలు పుట్టించేలా ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది. తెలుగులో నేహా ఎప్పుడు తిరిగి ఛాన్స్ అందుకుంటుందో చూడాలి.



## రామ్ సైకలాజికల్ థ్రిల్లర్‌కి ఆయన ఫిక్స్




రజనీకాంత్ 'పేట్ట', మహేశ్‌బాబు 'భరత్ అనే నేను', ఎన్టీఆర్ 'జనతా గ్యారేజ్', హృతిక్ రోషన్ 'క్రిష్ 3' వంటి సూపర్ హిట్ సినిమాలకు తిరునా వుక్కరసు (తిరు) సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేసిన సంగతి తెలిసిందే. రామ్ హీరోగా నటిస్తూ,, స్వీయ దర్శకత్వం వహించనున్న సినిమాకీ ఆయన ఛాయా గ్రాహకుడిగా వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రాపో సినిమా టిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని నిర్మించనున్న ఈ సైకలాజికల్ థ్రిల్లర్ సినిమా షూటింగ్ అతి త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో వీర అనే పాత్రలో నటిస్తారు రామ్. ''జాతీయ అవార్డు అందుకున్న అనుభవం, విజువల్ స్టైల్, ఫ్రేమింగ్, లైటింగ్, సినిమాటిక్ టెక్చర్‌లపై తిరుకు ఉన్న పట్టు, ఈ సినిమా విజువల్స్ మేకింగ్‌లో ప్రధాన ఆకర్షణగా ఉంటాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబరులో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఇటీవల ప్రకటించిన సంగతి గుర్తుండే ఉంటుంది.



## కర్మపై నాకు చాలా నమ్మకం ఉంది

మానవ సేవే మాధవ సేవ అంటారు. ఎందరు దీన్ని పాటిస్తారో తెలియదు కానీ మానవత్వం ఉన్న ప్రతిమనిషి చేతనైనా సాయం చేస్తుంటారు. అలాంటి సేవా భావం గురించి, అందులో కలిగే ఆనందం గురించి మృణాల్ ఠాకుర్ ఇప్పుడే తెలుసుకుందట. ఉత్తరాది భామనే అయినప్పటికీ బాలీవుడ్‌లో కంటే దక్షిణాదిలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. సీతారామం, హాయ్‌నాన్న వంటి చిత్రాలు మృణాల్ కెరీర్‌కి చాలా ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం తెలుగు, హిందీ భాషల్లో నటిస్తున్న ఈ భామ.. కోలీవుడ్ ఎంట్రీ ప్రయత్నాల్లో ఉంది.ఈ పాటికే హీరో శివకార్తికేయన్‌తో జోడీ కట్టే అవకాశం ఈమెని వరించింది. కొన్ని కారణాల వల్ల ఆ మూవీలో నటించలేకపోయింది. తాజాగా ధనుష్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధమవుతోంది. ఇకపోతే రీసెంట్‌గా ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఈమె.. జీవితంలో నిజమైన ఆనందం గురించి మాట్లాడుతూ నేను ఇప్పటివరకు ఏదేదో ఆనందాన్ని ఇస్తుందని అనుకున్నా. అయితే ఉన్నదానిలో ఇతరులకు ఇవ్వడంలోనే అసలైన సంతోషం కలుగుతుందని తెలుసుకున్నా. పెద్ద మొత్తంలో కాకపోయినా ఉన్నదానిలో కొంత లేనివారికి సాయం చేయాలి. కర్మపై నాకు చాలా నమ్మకం ఉంది. చేసిన సాయానికి ప్రతిఫలం ఉంటుందా అనేదాని గురించి ఎదురుచూడను. చేసిన సాయం వల్ల ఎవరైనా సంతోష పెడితే చాలు అని మృణాల్ ఠాకుర్ చెప్పింది.



## ఆ స్టార్ హీరో సినిమాలో పూజాహెగ్డే ఛాన్స్ కొట్టేసిందా..?

ప్రస్తుతం ఇండస్ట్రీలో బ్యాడ్ లక్ బ్యూటీగా మారిపోయింది. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా దూసుకుపోయిన ఈ చిన్నది ఇప్పుడు రేస్ లో వెనకబడింది. వరుస ఫ్లాప్స్ తో బ్యాడ్ లక్ హీరోయిన్ గా పేరు తెచ్చుకుంది. పూజ హెగ్డే నటించిన సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్స్ అవుతున్నాయి.తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేసినప్పటికీ ఈ చిన్నదానికి అదృష్టం మాత్రం కలిసి రావడం లేదు.స్టార్ హీరోల సినిమాలు కూడా ఈ అమ్మడిని ఆదుకోలేకపోతున్నాయి. దాంతో ఈ అమ్మడికి ఆఫర్స్ తగ్గుతూ వచ్చాయి.ఓ వైపు రష్మిక, కీర్తిసురేష్, త్రిష, నయన్ లాంటి హీరోలు పాన్ ఇండియా సినిమాలు చేస్తూ దూసుకుపోతుంటే పూజా మాత్రం హిట్స్ లేక సతమతం అవుతుంది. పూజా హెగ్డే సౌత్ చివరిగా స్టార్ హీరో సూర్య నటించిన రెట్రో సినిమాలో కనిపించింది. కూలీలో స్పెషల్ సాంగ్ చేసింది. విజయ్ జననయగాన్ సినిమాలో నటించింది కానీ ఈ సినిమా రిలీజ్ కాలేదు. ఇక ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ ఓ స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ అందుకుందని టాక్ వినిపిస్తుంది. వెంకటేష్ నటిస్తున్న సినిమాలో ఛాన్స్ అందుకుందని టాక్.

## షూటింగ్ టైంలో జాన్వీ అసౌకర్యానికి గురైందా?

'పెద్ది' సినిమా వచ్చింది. చూసినవాళ్లు మరీ సూపర్ కాకపోయినా ఓ మాదిరిగా బాగానే ఉందంటున్నారు. హీరోయిన్ జాన్వీ కపూర్ సీన్స్ గురించి మాత్రం ఎడతెగని చర్చ నడుస్తోంది. మరీ దారుణమైన యాంగిల్స్‌లో ఈమెని చూపించారని, ఈమె పాత్రకు అనుమతి లేకుండా హీరో ముద్దు పెట్టుకోవడం లాంటి సీన్స్‌పైనా విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే దర్శకుడు బుచ్చిబాబు కూడా సారీ చెప్పేశాడు. దీంతో సమస్య ముగిసిపోయిందని అంతా అనుకున్నారు. కానీ జాన్వీ కపూర్ గతంలో ఓ అభిమానితో 'పెద్ది'లో సన్నివేశాల గురించి చాట్ చేసిందంటూ ఇప్పుడు ఒకటి వైరల్ అవుతోంది.వైరల్ అవుతున్న చాట్ ప్రకారం.. 'పెద్ది' షూటింగ్ టైంలోనే తనని చూపించిన కెమెరా యాంగిల్స్ పట్ల జాన్వీ కపూర్ అసౌకర్యం వ్యక్తం చేసిందట. మరీ ముఖ్యంగా తన శరీరాన్ని జూమ్ చేసి చూపించే సన్నివేశాల్ని సినిమాలో ఉపయోగించొద్దని కూడా మూవీ టీమ్‌ని కోరిందట. తాను ఎందుకు అసౌకర్యానికి గురువుతున్నానో కూడా పలుమార్లు చెప్పే ప్రయత్నం చేసిందట. ఈ విషయంలో తనకు రామ్ చరణ్ మద్దతుగా నిలిచాడని, ఆయన కూడా కొన్ని కెమెరా యాంగిల్స్ పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారని అందులో ఉంది. ఈ చాట్ గతేడాది అక్టోబరులో జరిగినట్లు కూడా సదరు వీడియోలో ఉంది. మరి ఇది నిజమా కాదా అనేది తెలియాల్సి ఉంది.'పెద్ది' రిలీజ్ తర్వాత జాన్వీ కపూర్ చేసిన అచ్చియమ్మ పాత్రపైనే దాదాపు చాలామంది ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. యాక్టింగ్ కంటే అందచందాల ప్రదర్శన కోసమే ఈమెని తీసుకున్నారా అని సోషల్ మీడియాలో తెగ ట్రోల్ చేస్తున్నారు. జాన్వీ పాత్ర తీరుతెన్నులపై పలువురు సెలబ్రిటీలు కూడా పరోక్షంగా పోస్టులు పెట్టారు. ఏదేమైనా ఈ సినిమాకు వచ్చిన పాజిటివిటీ అంతా కూడా జాన్వీ పాత్ర వల్ల నెగిటివ్‌గా మారిపోయిందని చెప్పొచ్చు.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com